# వేకువ సమయం

సంపుటి: 14 సంచిక: 195

VEKUVA SAMAYAM TELUGU DAILY

* Mahabubnagar * Hyderabad * Miryalaguda & Rangareddy   సంపాదకులు : కె.భాస్కర్‌రావు   రూ.2.00/- పేజీలు 8   తేది: శుక్రవారం 14 ఆగష్టు 2026









ఝార్ఖండ్‌లో విద్యార్థుల నిరసన కార్యక్రమానికి సంబంధించి పోలీసులు తాజాగా 600 మందిపై కేసు నమోదు చేశారు. కేసు ఎదుర్కొంటున్న వారిలో 500 మంది గుర్తు తెలియని విద్యార్థులు కూడా ఉన్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షల్లో పేపర్ లీక్స్ ఉదంతాలకు నిరసనగా విద్యార్థులు నిరసనలు చేపడుతున్న విషయం తెలిసిందే.

**సమయం ప్రతినిధి:** నిరసన కార్యక్రమాలు ప్రస్తుతం 20వ రోజుకు చేరుకున్నాయి. సోమవారం అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో ఉద్రిక్త త పరిస్థితులు కనిపించాయి. విద్యార్థులను అదుపు చేసేందుకు పోలీ సులు బ్యాటన్ చార్జ్ చేశారు. వాటర్ క్యానన్, భాష్పవాయువు ను ప్రయోగించారు. పోలీసుల దౌర్జన్యానికి నిరసనగా మరుసటి రోజు బీజేపీ రాష్ట్రవ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చింది. పరీక్ష నిర్వహణ విషయంలో ప్రభుత్వం తమ డిమాండ్స్‌కు తలొగ్గే వరకూ నిరసనలు విరమించేది లేదని విద్యార్థులు స్పష్టం చేస్తున్నారు. జేపీఎస్‌సీ-జేఎస్ఎస్‌సీ మంచ్ ఆధ్వర్యంలో రాంచీలోని జైపాల్ సింగ్ ముండా స్టేడియం వద్ద నిరసనలు కొనసాగుతున్నాయి. పరీక్ష నిర్వహణలో మరింత పారదర్శకత తీసుకురావాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. పేపర్ లీక్ ఆరోపణలు ఉన్న పలు పరీక్షలను రద్దు చేయాలని కోరుతున్నారు. సీబీఐ లేదా ఇతర రాష్ట్రాల మాజీ జడ్జిలతో స్వతంత్ర దర్యాప్తు నిర్వహించాలని కూడా డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే, విద్యార్థుల డిమాండ్స్‌ను ప్రభుత్వం మరో వారంలోపు నెరవేర్చకపోతే తాను నిరాహార దీక్షకు దిగుతానని మాజీ ముఖ్యమంత్రి రఘుబర్ దాస్ బుధవారం ప్రభుత్వాన్ని హెచ్చరించారు. దేశవ్యాప్తంగా 1200 యూనివర్సిటీల్లో తాము నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చినట్టు ఏబీవీపీ కూడా తెలిపింది.




ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (APPSC) గ్రూప్-1 మూల్యాంకనంతో వైసీపీ అడ్డంగా దొరికిపోయిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. తమ వారికి ఉద్యోగాలు ఇప్పించుకునేందుకు అర్హులను బలి చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయంలో అందుబాటులో ఉన్న మంత్రులతో సీఎం చంద్రబాబు ఇవాళ (గురువారం) మధ్యాహ్నం లంచ్ మీటింగ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రూప్-1 అంశం చర్చకు వచ్చింది.

**సమయం ప్రతినిధి:** గ్రూప్-1 మూల్యాంకనంలో 97 శాతం జవాబు పత్రాలు దిద్ది ఉండటంపై సీఎం చంద్రబాబు, మంత్రులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లతో జవాబు పత్రాలు దిద్దించడంపై పలు పత్రికలు, ఛానళ్లలో వచ్చిన వార్తలను చూసి అందరూ ఆశ్చర్యపోతున్నారని సీఎంకు మంత్రులు వివరించారు. ఈ సందర్భంగా త్వరలో జరుగనున్న అసెంబ్లీ సమావేశాల్లోనూ గ్రూప్-1 వ్యవహారంపై వైసీపీని ఎండగట్టాలని సీఎంను కోరారు. సిట్ ఇచ్చిన నివేదిక ఆధారంగా గత వైసీపీ ప్రభుత్వం, అప్పటి ఏపీపీఎస్సీ కార్యదర్శి పీఎస్ఆర్ ఆంజనేయులు పాత్రపై మరింత లోతైన దర్యాప్తు చేయాలని మంత్రులు పేర్కొన్నారు. మరికొంతమంది అధికారుల పాత్రా ఉందని, దీనిపైనా దర్యాప్తు జరపాలని చంద్రబాబుకు మంత్రులు విజ్ఞప్తి చేశారు. 2011లో మహారాష్ట్రలోనూ ఇలానే జరిగితే అక్కడ అభ్యర్థులు పోరాటం చేశారని మంత్రులు గుర్తు చేశారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి.. సిట్ నివేదిక కోర్టు పరిధిలో ఉందని, న్యాయస్థానం నిర్ణయం ఏమిటో చూద్దామని మంత్రులకు సూచించారు. ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షల వ్యవహారంలో ఎవరెవరి పాత్ర ఉందనే అంశంపై సమాచారం సేకరించేందుకు కొంతమంది పోలీస్ శాఖ అధికారులకు ప్రభుత్వం టాస్క్ ఇచ్చిందన్నారు.




**సమయం ప్రతినిధి:** ముస్లిం మైనారిటీ రిజర్వేషన్లు అడ్డుకునేందుకు కొన్ని రాజకీయ పార్టీలు ప్రయత్నిస్తున్నాయని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ముస్లింలకు కాంగ్రెస్ 4 శాతం రిజర్వేషన్లు కల్పించిందని, వీటిని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. రిజర్వేషన్ల రద్దు కోసం అత్యున్నత న్యాయస్థానాల వరకూ వెళ్లారని ముఖ్యమంత్రి విమర్శించారు. అయినా చిత్తశుద్ధితో కాంగ్రెస్ అమలు చేసిందన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మైనారిటీల ప్రతిభా సదస్సుకు సీఎం రేవంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో ప్రతిభ కనబరిచిన పలువురు మైనారిటీలకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మైనారిటీ రిజర్వేషన్లకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యతిరేకమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ, సోనియా గాంధీ నేతృత్వంలోనే మైనారిటీలకు సంక్షేమం అందుతోందని చెప్పారు. కాంగ్రెస్ అంటేనే సెక్యులర్ పార్టీ అని, హిందూ, ముస్లింలను రెండుకళ్లలా చూస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపైనా ముఖ్యమంత్రి విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వం గ్రూప్-1 పరీక్షలను నిర్వహించలేకపోయిందని ఎద్దేవా చేశారు. ఓ ఆర్ఎంపీ డాక్టర్‌ను టీజీపీఎస్సీ సభ్యుడిగా నియమించారని సీఎం ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత టీజీపీఎస్సీని ప్రక్షాళన చేశామని సీఎం రేవంత్ పేర్కొన్నారు. యూపీఎస్సీ తరహాలో టీజీపీఎస్సీని బలోపేతం చేశామని ధీమా వ్యక్తం చేశారు. రిటైర్డ్ డీజీపీని టీజీపీఎస్సీ ఛైర్మన్‌గా నియమించామని చెప్పుకొచ్చారు. ఎంతో పారదర్శకంగా గ్రూప్-1 పరీక్షలు నిర్వహించామని తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన నిఖత్ జరీన్ కోసం నిబంధనలు పక్కనపెట్టి మరీ గ్రూప్-1 ఉద్యోగం ఇచ్చామని, అలాగే క్రికెటర్ సిరాజ్‌కు డీఎస్పీ ఉద్యోగం కల్పించామని సీఎం రేవంత్ గుర్తు చేశారు. మైనారిటీ యువత చదువుతో పాటు నైపుణ్యం సంపాదించాలని కోరారు. జర్మనీ, జపాన్ లాంటి దేశాల్లో ఎన్నో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేందుకు స్కిల్స్ యూనివర్సిటీ కూడా ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా తాను అందరి సహకారంతోనే తెలంగాణ ముఖ్యమంత్రి స్థాయికి చేరుకున్నట్లు రేవంత్ చెప్పుకొచ్చారు. SIR పేరుతో ఓట్లు తొలగించాలని కొందరు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. బెంగాల్‌లో గెలిచామని, ఇక తెలంగాణనే టార్గెట్ అని కొందరు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అక్కడ మమతా బెనర్జీ వదిలేశారేమో కానీ, ఇక్కడ కాంగ్రెస్ కార్యకర్తలు వదిలిపెట్టరని హెచ్చరించారు. 'గల్లీ గల్లీ తిరగండి, ఇంటింటికీ వెళ్లండి.. ప్రతీ ఒక్కరి ఓటును చెక్ చేయండి' అంటూ కార్యకర్తలకు సీఎం పిలుపునిచ్చారు. ప్రతీ ఒక్కరూ ఒక రేవంత్ రెడ్డిలాగా మారి ప్రజల ఓటు హక్కును కాపాడాలని విజ్ఞప్తి చేశారు.




**హైదరాబాద్ :** హైదరాబాద్ నగర శివారు గ్రామాల్లో బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు ప్రభావం భూముల క్రయ విక్రయాలపై పడింది. ఆయా ప్రాంతాల్లో మార్కింగ్ వేయడంతో భూములు కొనాలా వద్దా అనేది సంశయంగా మారింది. హైదరాబాద్ నగరానికి బుల్లెట్ ట్రైన్ ఒక ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు. ఈట్రైన్ ప్రధాన హబ్ శంషాబాద్. శంషాబాద్ టు ముంబై రూటులో జంట జలాశ యాలు ఉండడంతో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జలాశయాలకు ఇబ్బంది లేకుండా అధి కారులు రూటు ప్రిపేర్ చేస్తున్నారు. జలాశయాలపై భాగమైన గ్రామాల గుండా వెళ్లేలా రూటు మ్యాప్ తయారుచేశారు. గండిపేట హిమాయత్‌సాగర్ ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ దాటిన తర్వాత స్కెచ్ వేశారు. బుల్లెట్ ట్రైన్ భూమిపై కాకుండా పిల్లర్లు వేసి వంతెన పై నుంచి వెళ్లనుంది.

### పిల్లర్ల కోసం మార్కింగ్

బుల్లెట్ ట్రైన్ పిల్లర్ల కోసం గండిపేట హిమాయత్‌సాగర్ పై భాగంలో మార్కింగ్ చేశారు. శంషాబాద్ నుంచి నర్కూడ, కనకమామిడి, అప్పారెడ్డిగూడెం, మెడిపల్లి, చిన్నమంగళవారం, గోపులారం, జన్వాడ, మీర్జాగూడ, వట్టినాగులపల్లి, కోకాపేట గ్రామాల మీదుగా కోకాపేటకు పిల్లర్లకు మార్కింగ్ వేశారు. ఇక కోకాపేట నుంచి ఔటర్ మీదుగా స్టేషన్ నాగులపల్లి గ్రామంలో వికారాబాద్ రైల్వే లైన్‌కు ఇది కనెక్ట్ కానుంది. కోకాపేట నియో పోలీసు ప్రాంతంలో సైబరాబాద్ స్టేషన్ ఏర్పాటు కానుంది. ఇందుకోసమే ఈ బుల్లెట్ ట్రైన్ రూట్ ఇలా రూపొందించారు. ఇందులో నర్కూడ సుల్తాన్‌పల్లి ప్రాంతాలు శంషాబాద్ మండలంలో, కనకమామిడి మేడిపల్లి మొయినాబాద్ మండలంలో, గోపులారం, జన్వాడ, మిర్జాగూడ గ్రామాలు శంకర్‌పల్లి మండలంలో వట్టినాగులపల్లి, కోకాపేట గండిపేట మండలంలో, కొల్లూరు స్టేషన్ నాగులపల్లి సంగారెడ్డి జిల్లా రాంచంద్రాపురం మండలంలోకి వస్తాయి.

**రైతులపై బుల్లెట్ :** శంషాబాద్, శంకర్‌పల్లి, గండిపేట మండలంలోని గ్రామాల గుండా వస్తున్న ఈ బుల్లెట్ రూట్‌లో కోకాపేట గ్రామం మినహాయిస్తే మిగతావన్నీ జీవో 111 పరిధిలో ఉన్నాయి. ఆ గ్రామాలపై ఈ ప్రాజెక్టు ప్రభావం పడనుంది. బుల్లెట్ ట్రైన్ మార్గంలో రెండు పక్కల సర్వీస రోడ్లు నిర్మించనున్నారు. రోడ్ల నిర్మాణం కోసం భూసేకరణ చేపట్టాల్సి ఉంది. ఈ క్రమంలో ఎవరి భూములు ఎంత పోతాయి? అనే ఆందోళన ఉంది. అలాగే వేగంగా దూసుకెళ్లే బుల్లెట్ ట్రైన్ శబ్దానికి పంటలు పండుతాయా? అన్నది రైతులను కలవర పెడుతోంది. గ్రామాలలో వేసిన పిల్లర్ల నిర్మాణం తాలూకు మార్కింగ్‌లు భయపెడుతున్నాయి.




**సమయం ప్రతినిధి:** గీసుగొండ మండలం శాయంపేట శివారులోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో ఇవాళ (గురువారం) విషాద ఘటన చోటుచేసుకుంది. గణేశా ఎకోపెట్ క్లాత్ ఫ్యాక్టరీలో లిఫ్ట్‌లో ఇరుక్కుని ఇద్దరు సిబ్బంది మృతిచెందారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన సాంకేతిక నిపుణులు అభిలాష్ (30), సూర్యప్రకాశ్ (31)గా మృతులను గుర్తించారు. అయితే, వారిద్దరూ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తూ లిఫ్ట్‌లో ఇరుక్కుపోయారు. ఈ ఘటనలో ఇద్దరూ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. షార్ట్‌సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి ప్రమాదానికి గల పూర్తి కారణాలపై ఆరా తీస్తున్నారు. లిఫ్ట్‌లో ప్రమాదం ఎలా జరిగింది? నిజంగానే షార్ట్‌సర్క్యూట్ జరిగిందా? వంటి అంశాలపై దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు.

## యూనిటీ మాల్ ఒప్పందంపై విచారణ జరగాలి: ఎంపీ రఘునందన్ రావు..

ఢిల్లీ: తెలంగాణలో ప్రజల సొమ్ము దోచుకోవడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పోటీ పడుతున్నాయని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఆరోపించారు. బీఆర్ఎస్ పదేళ్ల అవినీతిని మించి కాంగ్రెస్ దోచుకోవాలని చూస్తోందని విమర్శించారు. ఈ రెండు పార్టీలు ఒకే నాణేనికి ఇరువైపులా ఉన్నటువంటివని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా యూనిటీ మాల్ పేరుతో జరిగిన ఒప్పందంపై సమగ్ర విచారణ జరపాలని ఎంపీ డిమాండ్ చేశారు. కేంద్రం ఇచ్చిన రూ.202 కోట్లతో యూనిటీ మాల్ నిర్మించాలని నిర్ణయించారని ఎంపీ రఘునందర్ రావు అన్నారు. అందుకు తెలంగాణ ప్రభుత్వం ఆరు ఎకరాలకు పైగా భూమి ఇచ్చిందన్నారు. అయితే, ఈ ఒప్పందంలో అవినీతి జరిగిందన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణలపై విచారణ జరగాలని ఎంపీ రఘునందన్ రావు స్పష్టం చేశారు. కేటీఆర్ తప్పు చేస్తే విచారణ జరిగినప్పుడు, కాంగ్రెస్ తప్పు చేస్తే విచారణ ఎందుకు ఉండకూడదని ప్రశ్నించారు. 2018లో బీఆర్ఎస్ హయాంలో 10 ఎకరాల భూమిని ప్రైవేట్ సంస్థకు కేటాయించారని, దానిపైనా విచారణ జరగాలన్నారు. ఈ రెండు భూకేటాయింపు ఒప్పందాలపై సమదృష్టితో దర్యాప్తు జరపాలని రఘునందన్ డిమాండ్ చేశారు. యూనిటీ మాల్, గత బీఆర్ఎస్ భూకేటాయింపులపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ కోరుతూ కేంద్ర విజిలెన్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు ఎంపీ చెప్పుకొచ్చారు. అలాగే, కాళేశ్వరం ప్రాజెక్టుపై డీపీఆర్ నుంచి చివరి చెల్లింపు వరకు సీబీఐ విచారణ జరపాలన్నారు. కేవలం మూడు బ్యారేజీలపై కాకుండా మొత్తం ప్రాజెక్టుపై దర్యాప్తు చేయాలన్నారు. కాళేశ్వరం మొత్తం ప్రాజెక్టుపై విచారణ జరిపించాలని కేంద్రానికి సీఎం రేవంత్ రెడ్డి లేఖ రాయాలని ఎంపీ సూచించారు. దానిపై కేంద్ర హోంమంత్రిని కలిసి దర్యాప్తు జరిగేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. మరోవైపు, రింగ్ రోడ్డు, ఫార్ములా-ఈ రేస్,



కాళేశ్వరం అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం మాట మార్చిందని ఎంపీ మండిపడ్డారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ ప్రజల దృష్టిని మళ్లిస్తున్నాయని రఘునందన్ రావు విమర్శించారు. వీళ్లిద్దరూ అవినీతిలో అన్నదమ్ములంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఈ సందర్భంగా తెలంగాణలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం రావాలని ప్రజలకు బీజేపీ విజ్ఞప్తి చేస్తోందన్నారు. హైదరాబాద్‌లో భూముల విలువ ఎకరాకు వందల కోట్లకు చేరిందని, ప్రజల ఆస్తులను విక్రయించే హక్కు ప్రభుత్వాలకు లేదని ఎంపీ తేల్చి చెప్పారు. ప్రజల ఆస్తులకు ప్రభుత్వాలు కస్టోడియన్లుగా ఉండాలని, అంతేకానీ యజమానులుగా వ్యవహరించొద్దని ఆయన పేర్కొన్నారు.

# సంపాదకీయం

## జెన్‌జీ: కొత్త తరమా, పాత చట్రమా?

'జెన్ జీ' అన్నది ఇప్పుడు నూతన ఉత్సాహాన్ని గుర్తుకు తెచ్చే పదం. ఈ 'జెన్ జీ' తరానికి ఇప్పుడో హీరో వర్షిప్ ఏర్పడింది. ఈ తరం ముందు తరాల్లా కాదనీ; భిన్నమైన ఆలోచనలతో ప్రతిదాన్నీ ప్రశ్నించే తరమనీ అంతా చెప్పుకుంటున్నారు. ప్రతి ఉద్యమం ఏదో ఒక తాత్కాలిక లక్ష్యంతోనే మొదలవుతుంది. కానీ అది వదిలివెళ్లే పాదముద్రలు దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపుతాయి. మన స్వాతంత్ర్యోద్యమం మొదలుకొని, చైనా సాంస్కృతిక విప్లవం దాకా ఎన్నో ఉద్యమాలు తాత్కాలిక విజయం కోసమే పని చేసినప్పటికీ, తదనంతరం ఆయా సమాజాల్లోని విలువలను ఎలా తలకిందులు చేశాయో చూశాం. ప్రతి ఉద్యమం తెచ్చే మార్పు ఆహ్వానించదగ్గదే. అయితే ఆ ఉద్యమం ప్రకటించిన భావనలు, విధానాలు, తీరుతెన్నులు... ప్రతి ఒక్కటీ సరైనదే అని మాత్రం చెప్పలేం. కార్పొరేట్ పరిభాషలో చెప్పాలంటే– ప్రొడక్ట్ మంచిదే కావచ్చు, కానీ అది తయారు చేయడానికి వాడిన టెక్నాలజీ కలగజేసిన వాతావరణ కాలుష్యం, దాని పరిణామాలు కొంతకాలం తర్వాతే తెలుస్తాయి. జెన్ జీ అన్నది నేటి యువతరానికి వాడుతున్న పర్యాయపదం. అంటే మానవ చరిత్రలో, పుట్టుకతోనే మొబైల్ ఫోన్స్, ఇంటర్నెట్, డిజిటల్ టెక్నాలజీని చూస్తూ వచ్చిన మొట్టమొదటి తరం. దీని ముందుతరం 'మిలీనియల్స్' (1981–96 మధ్యలో పుట్టినవాళ్లు). 'అనలాగ్', 'డిజిటల్' తరాన్ని ఒకేసారి చూస్తూ దానిని 'అడాప్ట్' చేసుకున్న మొదటి తరం ఈ మిలీనియల్స్. వీళ్లను సాధారణంగా 'అడాప్టబిలిటీ'కి ప్రతీకలుగా చూస్తారు. అంటే ఏ కొత్త మార్పుకైనా సులువుగా మారిపోతారు అని. ఇంతకు ముందు కూడా యువతరాలు సమాజాన్ని ప్రశ్నించి ఉద్యమాలు చేసిన సందర్భాలెన్నో ఉన్నాయి. 'నవనిర్మాణ్ ఆందోళన్' అని గుజరాత్‌లో 1974లో హాస్టల్ మెస్ చార్జీలకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమం చివరకు అక్కడి ముఖ్యమంత్రి రాజీనామాకు దారితీసింది. తమాషాగా అదే రాజకీయ నాయకుడు చిమన్‌భాయ్ పటేల్ సొంత పార్టీని స్థాపించి (కిసాన్ మజ్దూర్ లోక్ పక్ష్) 1975 ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేశారు, ఆపై 1990లో మళ్లీ గుజరాత్ ముఖ్యమంత్రిగా తిరిగి వచ్చారు. అది వేరే సంగతి. తెలంగాణ ఉద్యమాన్ని దగ్గరుండి నడిపింది అప్పటి యువతరమైన విద్యార్థులే. రోహిత్ వేముల మరణాన్ని నిరసిస్తూ నడిచింది అప్పటి తరం విద్యార్థులే. ఇలా చరిత్ర చూస్తే, ప్రతి తరమూ తమ కాలంలో ఏవో ఉద్యమాలు చేసి సంచలనాలు సృష్టించినదే. ఆ యువత తర్వాత ఎదిగి మళ్లీ అవే సామాజిక దురాచారాలను వెంట వేసుకునే తరాల్లో కలిసిపోయింది. ఇది చరిత్ర చెప్పిన నిజం. కాబట్టి ప్రస్తుతం 'జెన్ జీ'కి ఒక అసాధారణమైన హీరో వర్షిప్ కట్టబెట్టే ముందు ఆలోచించాల్సింది ఏమంటే– ఈ తరం ఏ విలువలను ముందుకు తీసుకెళ్లగలుగుతుంది అన్నది. ఈ జెన్ జీ ఇంటికెళ్లాక మళ్లీ అదే 'ఎండోగమీ'లో పడిపోయి ఎవరి కులాల పిల్లలను వాళ్లు పెళ్లి చేసుకుని, తర్వాత ఆ కులాల్లోనే పిల్లల్ని కని, కంటిన్యూ చేయడమే జరుగుతుంది. ఇక్కడ సమస్య ఏమిటంటే– 'జెన్ జీ' అనేది ఒక హోమోజీనస్ గుంపు కాదు. దీనికి ఒక ఐడెంటిటీని ఆపాదించలేం. ఇది నిర్ద్వంద్వంగా 'హెటిరోజీనస్ గ్రూప్' (విభిన్నతల సమూహం). ఈ ఉద్యమంలో సినిమా పాటలకు డాన్స్‌లు వేస్తూ, చప్పట్లు కొడుతూ నాట్యాలు చేసే యువతను చూసినప్పుడు ఇది సమస్యపై తీవ్రంగా పోరాడే గుంపులా గాక, తమకుండే మూక బలాన్ని ఎంజాయ్ చేసే గుంపులా మాత్రమే కనిపించింది. ఆ వినోదం వాళ్లను ఒకటి చేసింది, వాళ్లంతా కలిసి ఒక సమస్యను ఎదుర్కొన్నారు. అది సంతోషదాయకమైన విషయం. కానీ ప్రతి ఉద్యమమూ ఒక దుఃఖ సన్నివేశం నుంచి పుడుతుంది. ఉద్యమ క్రమంలో ఆ భావావేశాన్ని వెనక్కు నెట్టివేయడం 'జెన్ జీ' ఏ కాదు, అది ఎవరు చేసినా అసంబద్ధమే. ఒక మూర్ఖత్వాన్ని తృణీకరించాలంటే అందుకు సరైన మాధ్యమం వ్యంగ్యం (సెటైర్ లేదా సర్కాజం). 'జెన్ జీ' విషయంలో ఇది వ్యంగ్యాన్ని దాటి, బూతు రూపం కూడా తీసుకుంది, సందట్లో సడేమియా లాగా దానికి ఒక ఆమోద ముద్ర కూడా పడిపోతున్నది. ఇప్పటికిప్పుడు 'జెన్ జీ' ఉద్యమానికి అనుబంధంగా పుట్టిన విలువలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం లేదు. కానీ ఆ విలువలను విమర్శనాత్మకంగా గమనించాల్సి ఉంది. గాంధీ పక్కన అంబేడ్కర్ ఫొటో పెట్టడంతోటే ఈ ఉద్యమంలో ఉన్న తీవ్రమైన రాజీ స్వభావం లీలగా అర్థం అవుతున్నది. రోహిత్ వేముల మరణం తర్వాత మిలీనియల్స్ వ్యవస్థకు వ్యతిరేకంగా విస్తృత పోరాటం చేశారు. కానీ అది ఒక కులానికి సంబంధించిన పోరాటంగా ఉండిపోవడం వల్ల, ఆ తరానికి హీరోయిజం ఆపాదించబడలేదు. ఇప్పుడు 'జెన్ జీ'కి దొరికిన సింపతీని నాడు అన్యాయానికి నిర్ద్వంద్వంగా ఎదురు తిరిగి, యూనివర్సిటీ హాస్టల్స్ నుంచి వెలివేయబడ్డ మిలీనియల్స్ దక్కించుకోలేకపోయారు. సెప్టెంబర్ 2025లో ఢిల్లీ యూనివర్సిటీ ఎన్నికలను గమనిస్తే, ఆరెస్సెస్ అనుబంధ విద్యార్థి సంస్థ అయిన ఏబీవీపీ ఈ ఎన్నికల్లో ఘన విజయం సాధించింది. అది అలా గెలిచింది ఈ 'జెన్ జీ' ఓట్లతోనే. ఇదే 'జెన్ జీ' హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఎన్నికల్లో కూడా ఏబీవీపీనే ఎన్నుకుంది. కాబట్టి ఈ 'జెన్ జీ' తరం ఇంతకుముందు తరాలకు భిన్నంగా ఏమీ లేదు, ముఖ్యంగా ఇందులో హెటిరోజినిటీని తగు మోతాదులో కలుపుకునే ఉంది. ఈ తరాన్ని 'ఇన్‌స్టా' తరం అనవచ్చు. మిలీనియల్స్ 'ఫేస్‌బుక్'ను ఆదరించినంతగా వీళ్లు ఆదరించలేదు. ఇది 2017 నుంచి కనిపించడం మొదలుపెట్టింది. రెండు నిమిషాల రీల్స్‌లో విషయం అంతా తెలియాలని తాపత్రయపడే ఈ తరానికి అనుగుణంగా మార్కెటింగ్ యాడ్స్ రూపుదిద్దుకోవడం మొదలైంది. ఈ జెన్ జీ ఇన్‌స్టా తరం పూర్తిగా డిజిటల్ యుగంలో పెరగడం వల్ల సులువైన పనులకు అలవాటుపడిన తరంగా మారింది. అలాగే ఈ తరం తమ వ్యక్తిగత ఆస్పిరేషన్స్ విషయంలో రాజీపడని తరం. ఉదాహరణకు, జెన్ జీ తమ కెరీర్ ఆరంభ దశలో ఒక ఉద్యోగంలో సగటున కేవలం 1.1 సంవత్సరాలు మాత్రమే కొనసాగుతున్నారు; మిలీనియల్స్‌కు ఇది 1.8 సంవత్సరాలు కాగా, అంతకుముందు తరం జెన్ ఎక్స్‌కు 2.8 సంవత్సరాలు. ఈ తరం హోమోజినిటీ (ఏకరూపత) కేవలం వ్యక్తిగత ఆస్పిరేషన్స్ వరకు మాత్రమే పరిమితం. ఇది సామాజిక ఆస్పిరేషన్స్‌తో కలగాపులగం చేసి మనం కన్‌ఫ్యూజ్ అవకూడదు. సామాజిక ఆశయాల విషయంలో ఈ తరం ముందు తరాల లాగానే ఒక హెటిరోజీనస్ గ్రూప్. దీని హెటిరోజినిటీని (విభిన్నతలను) గమనించిన మొదటి వ్యవస్థ 'సంఘ్ పరివార్'. అందుకే అది ఇప్పుడు ఈ 'జెన్ జీ' తరాన్ని రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమానికి సిద్ధం చేస్తున్నది. ఇటీవల 'రిజర్వేషన్ హటావో ఆందోళన్' అనే ఒక ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌కు కొద్ది రోజుల్లోనే యాభై లక్షల మందికి పైగా ఫాలోవర్స్ వచ్చారు. కుల ఆధారిత కంటెంట్‌ను ప్రచారం చేస్తూ ఎక్కువ ఎంగేజ్మెంట్ పొందుతున్న 30కి పైగా ఇన్‌స్టాగ్రామ్ ఖాతాల నుంచి 100కు పైగా రీల్స్‌ను 'ది క్వింట్' వెబ్‌సైట్ విశ్లేషించింది. ఆ విశ్లేషణలో ఒక విషయం స్పష్టమైంది: ఆధిపత్య కులాల ఆధిక్యత భావజాలాన్ని ఇప్పుడు సోషల్ మీడియా అల్గోరిథమ్‌లకు అనుగుణంగా, 'గర్వం (ప్రైడ్)' అనే పేరుతో కొత్త రూపంలో ప్రజలకు చేరవేస్తున్నారు. ఇది జరుగుతున్నదీ 'జెన్ జీ' తరంలోనే. అధికారాన్ని ప్రశ్నించడం, అన్యాయాన్ని ఎదిరించడం, మార్పు కోసం సంఘటితమవడం–– ఇవి జెన్ జీ కనిపెట్టిన కొత్త సంస్కృతి కాదు. ఆధునిక భారత చరిత్రలో దాదాపు ప్రతి తరం యువత తమ కాలంలోని వ్యవస్థను సవాలు చేస్తూ ఉద్యమాలు నడిపింది. అంతకుమించి 'జెన్ జీ' అసామాన్యంగా సాధించింది లేదు. ఏది ఏమైనా రెండు నిమిషాల రీళ్లతో సమయం గడిపే ఈ యువతరం, ఎక్కడా కుదురుగా ఒకేచోట పనిచేసే ఓపిక లేని ఈ యువతరం, ఒక దేశ సమస్యను ఎదిరించడానికి తమ విభిన్నతలను దాటి ఒక ఏకరూప సమూహంగా ప్రగతివాదంతో ముందుకెళ్లడం జరిగితే, అప్పుడు ఈ దేశంలో నిజమైన విప్లవాన్ని ఆశించవచ్చు.

# ఖేలో ఇండియా గేమ్స్‌కు హాజరు కావాలని కేంద్ర మంత్రిని ఆహ్వానించిన మంత్రి వాకిటి శ్రీహరి





హైదరాబాద్ : ప్రతిష్ఠాత్మకమైన ఖేలో ఇండియా యూత్ గేమ్స్–2026కు తెలంగాణ రాష్ట్రం ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ ఏడాది డిసెంబర్ 11 నుండి 22 వరకు నిర్వహించనున్న ఎనిమిదో ఎడిషన్‌కు హైదరాబాద్ ప్రధాన వేదికగా నిలవనుంది. ఈ సందర్భంగా రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు జితేందర్ రెడ్డి,సాట్స్ చైర్మన్ శివసేనా రెడ్డి,సాట్స్ ఎండి సోనీ బాలాదేవితో కలిసి ఈ రోజు ఢిల్లీ లో కేంద్ర యువజన, క్రీడా శాఖ మంత్రి మన్సూఖ్ మాండవీయను కలిసి ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఆహ్వానించారు.దేశవ్యాప్తంగా 8,000 మందికి పైగా క్రీడాకారులు ఈ గేమ్స్ లో పాల్గొనే అవకాశం ఉందని మంత్రి తెలిపారు.క్రీడా పోటీలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లను వేగవంతం చేస్తోందన్నారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల అధికారులతో సమీక్ష నిర్వహించి, క్రీడా మైదానాలు, స్టేడియంల పరిస్థితిని పరిశీలించి అవసరమైన శాశ్వత మౌలిక వసతుల అభివృద్ధి చేపట్టాలని ఆదేశించారన్నారు.ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహణ ద్వారా తెలంగాణలోని యువ

**డిసెంబర్ 11 నుండి 22 వరకు తెలంగాణలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్**

క్రీడాకారులకు జాతీయ స్థాయిలో తమ ప్రతిభను చాటుకునే మంచి అవకాశం లభించనుందని మంత్రి స్పష్టం చేశారు.క్రీడా మౌలిక వసతుల అభివృద్ధితో పాటు ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి వారికి శిక్షణ, ప్రోత్సాహం అందించేందుకు ఈ పోటీలు దోహదపడనున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం గచ్చిబౌలి స్పోర్ట్స్ డిస్ట్రిక్ట్, యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ వంటి కార్యక్రమాలతో రాష్ట్రాన్ని క్రీడా కేంద్రంగా అభివృద్ధి చేసే దిశగా చర్యలు చేపడుతోందని మంత్రి తెలియజేశారు . ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహణ తెలంగాణ క్రీడా రంగానికి మరింత ఊపునిస్తుందని అభిప్రాయపడ్డారు. ఖేలో ఇండియా గేమ్స్ కు తెలంగాణను ఎంపిక చేసినందుకు మంత్రి వాకిటి శ్రీహరి కేంద్రానికి కృతజ్ఞతలు తెలిపారు.

# అలీన దేశాల గళం.. ఫిడేల్!

సమయం ప్రతినిధి: ఆగస్టు 13న ఫిడేల్ కాస్ట్రో శతజయంతి ఉత్సవాలు జరుగుతున్న వేళ, నా జ్ఞాపకాలు 1987 నాటి క్యూబా పర్యటన వైపు మళ్లాయి. హవానాలో ఇంటర్నేషనల్ యూనియన్ ఆఫ్ స్టూడెంట్స్ (ఐయుఎస్) 15వ మహాసభలో అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) జాతీయ ప్రధాన కార్యదర్శిగా నేను పాల్గొన్నాను. ఒక మారుమూల గ్రామంలోని మధ్యతరగతి రైతు కుటుంబంలో పుట్టిన నాకు, అంతర్జాతీయ విప్లవాగ్ని వెలిగించిన క్యూబా గడ్డపై ఫిడేల్ విప్లవ ప్రసంగాన్ని ప్రత్యక్షంగా వినే అరుదైన అవకాశం లభించింది. నవంబర్ 16న హవానా విశ్వవిద్యాలయం ముందు జరిగిన ప్రారంభోత్సవానికి 5 వేల మంది క్యూబన్ విద్యార్థులు విచ్చేశారు. వివిధ దేశాల సంస్కృతులు, ప్రతిధ్వనించిన విప్లవ నినాదాలతో హవానా నగరమంతా పండుగ వాతావరణాన్ని తలపించింది. మహాసభ చివరి దశకు చేరుకుంటున్నది. ఒక్కసారిగా హడావుడి మొదలై, 'రెడ్ సెల్యూట్ టు ఫిడేల్!' అంటూ హాలంతా దద్దరిల్లింది. క్యూబా దేశాధ్యక్షుడు, అలీనోద్యమ నేత, ప్రపంచ విప్లవోద్యమానికి స్ఫూర్తి ప్రదాత ఫిడేల్ కాస్ట్రో సభలోకి ప్రవేశించారు. కాస్ట్రో రాక అందర్నీ దిగ్భ్రాంతికి గురిచేసింది. సభలో ఆయన ప్రసంగించబోతున్నారన్న విషయాన్ని నిర్వాహకులు అప్పటివరకూ అత్యంత రహస్యంగా ఉంచారు. కారణం, ఆయనను హతమార్చడానికి సామ్రాజ్యవాద అమెరికా నిఘా సంస్థ సీఐఏ, అప్పటికే లెక్కకు మించినసార్లు విఫల ప్రయత్నాలు చేసింది. ఆయన స్పానిష్ భాషలో చేసిన గంభీరమైన, ఉత్తేజకర ప్రసంగాన్ని హెడ్‌ఫోన్ల ద్వారా తర్జుమాలో వింటున్నా, ఆయన హావభావాలు, గంభీరమైన గళం, ముఖకవళికలు వర్ణనాతీతమైన విప్లవస్ఫూర్తిని నింపాయి. కాస్ట్రో తన ప్రసంగంలో తృతీయ ప్రపంచ దేశాల సమస్యలపై లోతైన విశ్లేషణ చేశారు. ఆ దేశాలపై ఉన్న విదేశీ అప్పులు తీర్చడం ఆర్థికంగా, నైతికంగా అసాధ్యమని కుండబద్దలు కొట్టారు. ఆ రుణాలు చెల్లించడం అంటే పేద దేశాల ప్రజల విద్య, వైద్య బడ్జెట్‌లను కొల్లగొట్టడమేనని నిరసించారు. ప్రపంచ విద్యార్థిలోకం ఈ రుణ విముక్తి కోసం, నూతన అంతర్జాతీయ ఆర్థిక విధానం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. క్యూబాపై అమెరికా విధించిన ఆర్థిక దిగ్బంధనాలు, కుట్రలను తిప్పికొడుతూ తన దేశం సాధించిన ప్రగతిని, సోషలిస్టు వ్యవస్థ నిర్మాణం దిశగా సాగిస్తున్న ప్రయాణాన్ని వివరించారు. విద్య విప్లవీకరణలో భాగంగా 1960ల నుంచి క్యూబా అమలు చేస్తున్న 'చదువు––పని' విధానాన్ని వివరించారు. విద్య వ్యాపారీకరణ కాకూడదని, సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడాలని ఉద్బోధించారు. నేను క్యూబా వెళ్లేనాటికే తృతీయ ప్రపంచ దేశాలకు చెందిన 22 వేల మందికి పైగా విద్యార్థులు అక్కడ ఉచితంగా చదువుకుంటున్నారు. ఆనాటికే క్యూబాలో ప్రతి 325 మందికి ఒక డాక్టర్ ఉన్నారు, శిశు మరణాల రేటు అత్యల్పం. ఫిడేల్ ఆనాడు లేవనెత్తిన ఆర్థిక అసమానతలు, విదేశీ రుణ భారం, విద్యా హక్కుల అంశాలు, అమెరికన్ ఆధిపత్యం నేటికీ అత్యంత ప్రాధాన్యమైనవి. లాటిన్ అమెరికా దేశాలను అమెరికా తన 'పెరటిస్థలం'గా భావిస్తూ వస్తోంది. 1823 నాటి 'మన్రో సిద్ధాంతం' ఆధారంగా ప్రస్తుత అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆ ప్రాంతంపై తన ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఒకప్పుడు రాజకీయ ఒత్తిళ్లు––ఆర్థిక ఆంక్షలకే పరిమితమైన అమెరికా, ఇటీవలి కాలంలో ప్రత్యక్ష జోక్యాల ద్వారా ఆ ప్రాంతంపై తన ఆధిపత్యాన్ని చలాయించాలని చూస్తోంది. దీనికి స్పష్టమైన ఉదాహరణ వెనెజువెలాలో ఇటీవల సంభవించిన పరిణామాలే. 1960ల నుంచి క్యూబాపై అమెరికా అత్యంత కఠినమైన ఆర్థిక ఆంక్షలను అమలుచేస్తోంది. ఇటీవల మరిన్ని కొత్త ఆంక్షలను విధించింది. రష్యా, చైనాలతో క్యూబాకు ఉన్న వ్యూహాత్మక సంబంధాల దృష్ట్యా, క్యూబాను తమ జాతీయ భద్రతకు ముప్పుగా అమెరికా అభివర్ణిస్తోంది. క్యూబాపై సైనిక చర్యలు ఉంటాయంటూ ట్రంప్ పదేపదే హెచ్చరికలు చేస్తున్నారు. అమెరికా విధిస్తున్న ఆర్థిక, ఇంధన ఆంక్షలు ప్రస్తుతం ఆ దేశాన్ని తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెట్టాయి. దశాబ్దాలుగా సాగుతున్న ఈ ఆంక్షలను ఇటీవల మరింత కఠినం చేయడంతో, క్యూబాలో కనీస మౌలిక వసతులు పూర్తిగా స్తంభించిపోయే స్థితి ఏర్పడింది. వ్యవసాయం, రవాణా వ్యవస్థలు దెబ్బతిన్నాయి. ఆహార ఉత్పత్తి పడిపోయింది. విదేశాల నుంచి ఆహార పదార్థాలను దిగుమతి చేసుకోకుండా అంతర్జాతీయ బ్యాంకింగ్ లావాదేవీలపై అమెరికా నిఘా ఉంచింది. దీంతో ఆహార భద్రతకు ముప్పు ఏర్పడింది. అయినా, అమెరికాకు క్యూబా ఎదురొడ్డి నిలుస్తోంది. క్యూబాలో సోషలిస్ట్ పతాకాన్ని ఎగురవేసి, అణచివేతకు గురవుతున్న ప్రపంచ దేశాలకు అండగా నిలిచిన గొప్ప విప్లవకారుడు ఫిడేల్ కాస్ట్రోకు ఆయన శత జయంతి సందర్భంగా 'రెడ్ సెల్యూట్'.

# సీజేఐ ఆహ్వానంపై నిరసన.. నల్సార్ 2026 న్యాయ విద్యార్థులపై బార్ కౌన్సిల్ కీలక నిర్ణయం..

సమయం ప్రతినిధి: హైదరాబాద్‌లోని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం 2026 బ్యాచ్ విద్యార్థులకు సంబంధించి బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (BCI) కీలక నిర్ణయం తీసుకుంది. 2026లో నల్సార్ నుంచి న్యాయ పట్టా పొందిన విద్యార్థులను తదుపరి ఆదేశాలు వచ్చే వరకు న్యాయవాదులుగా నమోదు చేయవద్దని అన్ని రాష్ట్రాల బార్ కౌన్సిళ్లను బీసీఐ ఆదేశించింది. నల్సార్ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవానికి భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించడంపై కొందరు విద్యార్థులు అభ్యంతరం వ్యక్తం చేశారు. 2026లో పట్టా పొందనున్న విద్యార్థులతో పాటు ఇతర బ్యాచ్‌లకు చెందిన విద్యార్థులు కూడా ఈ అభ్యంతరాలకు మద్దతు తెలిపినట్లు సమాచారం. ఇటీవల ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన నిరసనలకు సంబంధించి సీజేఐ చేసిన వ్యాఖ్యలే విద్యార్థుల అభ్యంతరాలకు కారణంగా నిలిచాయి. ఈ నేపథ్యంలో బీసీఐ సంచలన నిర్ణయం తీసుకుంది.నల్సార్ యూనివర్సిటీ నుంచి 2026లో న్యాయ పట్టా పొందిన ఏ విద్యార్థినీ న్యాయవాదిగా నమోదు చేయకూడదని రాష్ట్ర బార్ కౌన్సిళ్లకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ మానన్ కుమార్ మిశ్రా ఆదేశాలు జారీ చేశారు. అంతేకాకుండా, విశ్వవిద్యాలయంలో విద్యార్థుల నిరసనకు సంబంధించి ప్రధానంగా ఎవరు ప్రచారాన్ని ప్రారంభించి, సమన్వయం





చేశారో వివరాలతో కూడిన నివేదిక ఇవ్వాలని నల్సార్ విశ్వవిద్యాలయాన్ని బీసీఐ కోరింది.

# వర్షాకాలంలో ఇంట్లో క్రిములు పెరగకుండా ఉండాలంటే.. ఈ చిట్కాలు పాటించండి!

సమయం ప్రతినిధి: వర్షాకాలంలో వాతావరణంలో తేమ పెరగడంతో ఇళ్లలో బూజు, బ్యాక్టీరియా, ఇతర సూక్ష్మజీవులు పెరిగే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా వంటగది, బాత్రూమ్, సింక్ వంటి తడి ప్రదేశాల్లో వీటి ప్రభావం ఎక్కువగా ఉంటుంది. అందుకే ఇంటిని శుభ్రంగా, పొడిగా, గాలి బాగా ప్రసరించేలా ఉంచడం చాలా ముఖ్యం.

**తరచుగా తాకే ప్రదేశాలను శుభ్రం చేయండి :** తలుపుల హ్యాండిల్స్, లైట్ స్విచ్‌లు, టేబుళ్లు వంటి వాటిని క్రమం తప్పకుండా శుభ్రం చేయాలి. వీటిపై దుమ్ము, మురికి పేరుకుపోకుండా సబ్బు నీరు లేదా ఇంట్లో ఉపయోగించే సర్ఫేస్ క్లీనర్‌తో తుడవచ్చు.

**వంటగదిపై ప్రత్యేక శ్రద్ధ :** వంటగదిలోని సింక్, కౌంటర్లు, స్టవ్ వంటి ప్రదేశాలను రోజూ శుభ్రం చేయడం మంచిది. వాడిన పాత్రలను ఎక్కువసేపు అలాగే ఉంచకుండా వెంటనే కడగాలి. గిన్నెలు తుడిచే గుడ్డలు, స్పాంజ్‌లను తడిగా వదిలేయకుండా కడిగి, నీటిని పిండేసి గాలి తగిలే ప్రదేశంలో ఆరబెట్టాలి. పచ్చి మాంసం, కూరగాయల కోసం వేర్వేరు కటింగ్ బోర్డులు ఉపయోగిస్తే ఆహారంలో సూక్ష్మజీవులు వ్యాపించే ప్రమాదాన్ని తగ్గించవచ్చు.

**బాత్రూమ్‌ను పొడిగా ఉంచండి :** వర్షాకాలంలో బాత్రూమ్‌లో తేమ పెరగడంతో బూజు ఏర్పడే అవకాశం ఉంటుంది. స్నానం చేసిన తర్వాత నేలపై ఉన్న నీటిని వీలైనంత త్వరగా తుడవాలి. బాత్రూమ్‌లో గాలి, వెలుతురు బాగా వచ్చేలా చూసుకోవాలి. టాయిలెట్, సింక్, నేల వంటి ప్రదేశాలను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలి.

**ఇంట్లో దుమ్ము పేరుకుపోకుండా చూసుకోండి :** కిటికీలు, ఫర్నిచర్, అల్మారాలు, షెల్ఫ్‌లపై దుమ్ము పేరుకుపోకుండా క్రమం తప్పకుండా శుభ్రం చేయాలి. ముందుగా పైభాగాల్లోని దుమ్మును తొలగించి, ఆ తర్వాత వాక్యూమ్ చేయడం లేదా ఊడవడం, చివరగా నేలను తుడవడం మంచిది. ఇలా చేయడం వల్ల ఇంట్లో దుమ్ము, అలర్జీ కారకాలు తగ్గించుకోవచ్చు.

**శుభ్రం చేసే గుడ్డలు, స్పాంజ్‌లను ఆరబెట్టండి :** మాప్‌లు, స్పాంజ్‌లు, శుభ్రం చేసే గుడ్డల్లో కూడా క్రిములు పెరిగే అవకాశం ఉంటుంది. ఉపయోగించిన తర్వాత వాటిని బాగా కడిగి, నీటిని పిండేసి పూర్తిగా ఆరబెట్టాలి. ముఖ్యంగా.. వర్షాకాలంలో ఇంట్లో గాలి, వెలుతురు బాగా ప్రసరించేలా చూసుకోవాలి.

# దేశంలోనే అతి తక్కువ స్టైఫండ్ ఆయుష్ విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం ఆటలు








**హైదరాబాద్:** తెలంగాణ ఆయుష్ హౌస్ సర్జన్స్ అండ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ జాయింట్ యాక్షన్ కమిటీ (JAC) ఆధ్వర్యంలో స్టైఫండ్ పెంపు కోసం ధర్నా చౌక్ లో నిర్వహించిన ధర్నాకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ చీఫ్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న హాజరై తన సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు.

**దేశంలోనే అత్యల్ప స్టైఫండ్:**
భారతదేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో ఆయుష్ విద్యార్థులకు అత్యంత తక్కువ స్టైఫండ్ ఇస్తున్నారని మల్లన్న ఆవేదన వ్యక్తం చేశారు. పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ 2025లో స్టైఫండ్‌ను పెంచిన విషయాన్ని గుర్తు చేస్తూ,తెలంగాణలో విద్యార్థులు అర్ధాకలితో అలమటించడం సిగ్గుచేటని అన్నారు.

**ఎమ్మెల్యేల జీతాలు పెంచుకోవడానికి ఉన్న ఆసక్తి, విద్యార్థుల స్టైఫండ్ పెంపుపై ఎందుకు లేదు? అసెంబ్లీలో ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం. బిటీఆర్పీ చీఫ్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న**

**ప్రభుత్వ వైఖరిపై విమర్శలు:**
"వర్క్ లోడ్ తక్కువ ఉంది" కాబట్టి తక్కువ స్టైఫండ్ ఇస్తున్నామనే ప్రభుత్వ వాదనను ఆయన తీవ్రంగా ఖండించారు. పని తక్కువైతే విద్యార్థుల ఖర్చులు, ఇంటి కిరాయిలు ఏమైనా తగ్గుతాయా అని ఆయన ప్రశ్నించారు. ప్రజల పన్నుల డబ్బుతోనే స్టైఫండ్ పెంచమని అడుగుతున్నామని, ఇది ఎవరి సొంత సొమ్ము కాదని స్పష్టం చేశారు. తెలంగాణలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు దేశంలోనే అత్యధిక జీతాలు తీసుకుంటున్నారని, వారి జీతాలను గతంలో లక్ష నుండి రూ. 2,75,000కు పెంచుకున్న పాలకులు, ఆయుష్ బిడ్డల స్టైఫండ్ పెంపును మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇది కేవలం ఒక పార్టీ సమస్య కాదని, గత కేసీఆర్ ప్రభుత్వం నుండి ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం వరకు అందరూ విద్యార్థులను వంచించినవారేనని మల్లన్న అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈ విషయంలో తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు.రాబోయే శాసనసభ, శాసనమండలి సమావేశాల్లో ఈ అంశాన్ని బలంగా ప్రస్తావిస్తామని హామీ ఇచ్చారు. ప్రాచీన వైద్య విద్యలను ప్రోత్సహించాల్సిన ప్రభుత్వం, విద్యార్థులను ఇలా రోడ్డుపైకి తీసుకురావడం దురదృష్టకరమని, విద్యార్థుల పోరాటానికి తన వంతుగా పూర్తి అండగా నిలబడతానని తీన్మార్ మల్లన్న హామీ ఇచ్చారు.

## 2లక్ష 50వేలు LOC లెటర్‌ను అందజేసిన ఎమ్మెల్యే



గద్వాల : ఈరోజు గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు గద్వాల టౌన్ 27వ వార్డ్ షేరెల్లి వీధీ చెందిన సత్యమ్మ w/o లక్ష్మన్న మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరు అయిన 2లక్ష 50వేలు రూపాయల LOC లెటర్ ను లిగద్వాల ఎమ్మెల్యే శ్రీ బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి గారి చేతుల మీదుగా అందజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గోవిందు, మాజీ ఎంపీపీ రాజారెడ్డి, జిల్లా సీనియర్ నాయకులు బండ్ల రాజశేఖర్ రెడ్డి నాయకులు వినోద్, షాషా, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పాలమూరు ప్రాజెక్టులపై బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేల మంత్రి వాకిటి శ్రీహరి కౌంటర్

**లోకాయుక్తకు ఫిర్యాదు పేరుతో రాజకీయ డ్రామా వద్దు..**
**ఆరోపణలు నిరూపిస్తే చర్యలకు సిద్ధం: మంత్రి వాకిటి శ్రీహరి**

హైదరాబాద్ : కొడంగల్ ఎత్తిపోతల పథకం భూసేకరణలో అక్రమాలు జరుగుతున్నాయంటూ మాజీ ఎమ్మెల్యేలు చేసిన ఆరోపణలను మంత్రి వాకిటి శ్రీహరి తీవ్రంగా ఖండించారు. ఆధారాలు లేకుండా ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఆరోపణలు చేయడం సరికాదని, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకునేందుకు రాజకీయ దుష్ప్రచారం చేయొద్దని ఆయన స్పష్టం చేశారు.భూసేకరణలో అవకతవకలు జరిగితే ఆధారాలతో నిరూపించాలికొడంగల్ ఎత్తిపోతల పథకం భూసేకరణలో నకిలీ పాసుపుస్తకాలు, బోగస్ పట్టాలు సృష్టించి అక్రమంగా పరిహారం చెల్లిస్తున్నారని ఆరోపిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు అందుకు సంబంధించిన ఆధారాలను బయటపెట్టాలని మంత్రి డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారమే భూసేకరణ, పరిహారం ప్రక్రియను నిర్వహిస్తోందన్నారు.నిజంగా ఎక్కడైనా అక్రమం జరిగితే సంబంధిత అధికారులపై, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం వెనుకాడదని స్పష్టం చేశారు. లోకాయుక్తకు ఫిర్యాదు చేసిన విషయాన్ని రాజకీయ ప్రచారంగా కాకుండా చట్టపరమైన ప్రక్రియగా ఎదుర్కొంటామని అన్నారు.

**నిర్వాసితులకు న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యం :** ఎత్తిపోతల పథకం వల్ల భూములు కోల్పోయే రైతులు, నిర్వాసితులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ నిబంధనల ప్రకారం పరిహారం అందుతుందని, అనర్హులకు ఒక్క రూపాయి కూడా దక్కకుండా వ్యవస్థను పర్యవేక్షిస్తామని చెప్పారు. నిర్వాసితుల జాబితాలో మార్పులు జరిగాయని ఆరోపణలు చేస్తున్న వారు ఆ మార్పులకు సంబంధించిన అధికారిక రికార్డులను ప్రజల ముందు ఉంచాలని కోరారు. ముఖ్యమంత్రి, ఆయన కుటుంబ సభ్యులపై వ్యక్తిగత ఆరోపణలు చేయడం ద్వారా సమస్యకు పరిష్కారం లభించదని, వాస్తవాలు ఉంటే విచారణ సంస్థల ముందు ఉంచాలని సూచించారు. ప్రభుత్వం చట్టబద్ధమైన విచారణలకు ఎప్పుడూ సహకరిస్తుందని తెలిపారు.

**ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలపై నిపుణులే నిర్ణయిస్తారు**
కొడంగల్ ఎత్తిపోతల పథకం అసాధ్యమని, పైపుల ద్వారా నీటిని తరలించడం కష్టమని మాజీ ఎమ్మెల్యేలు చేస్తున్న వ్యాఖ్యలను మంత్రి కొట్టిపారేశారు. ప్రాజెక్టుల సాంకేతిక సాధ్యాసాధ్యాలను రాజకీయ నాయకుల అంచనాలతో కాకుండా నిపుణుల సాంకేతిక నివేదికలు, డిజైన్లు, అనుమతులు నిర్ణయిస్తాయని చెప్పారు. ప్రాజెక్టుకు సంబంధించిన అనుమతులు, సాంకేతిక అంశాలపై సందేహాలు ఉంటే సంబంధిత శాఖల వద్ద వివరాలు తెలుసుకోవాలని సూచించారు. ప్రజలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపడుతున్న ప్రాజెక్టులను రాజకీయ కారణాలతో అడ్డుకోవడం సమంజసం కాదన్నారు.

**కమిషన్ల ఆరోపణలు నిరాధారం**
మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కాంట్రాక్ట్ సంస్థలు, కాంగ్రెస్ నాయకులపై కమిషన్ల ఆరోపణలు చేయడం బాధ్యతారాహిత్యమని వాకిటి శ్రీహరి అన్నారు. అవినీతి జరిగిందని చెబుతున్న వారు ఒక్కో ఆరోపణకు ఆధారాలు చూపాలని, నిరూపిస్తే విచారణకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

**రాజకీయ ఆరోపణలకు కాకుండా ప్రజల సమస్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి**
మాజీ ఎమ్మెల్యేలు పదేపదే ఆరోపణలు చేయడం వల్ల రైతులకు న్యాయం జరగదని, వాస్తవ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని మంత్రి సూచించారు. భూసేకరణలో అర్హులైన రైతులకు న్యాయం చేయడం, ప్రాజెక్టును నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయడం ప్రభుత్వ బాధ్యత అని చెప్పారు. "ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం సులువు. కానీ ఆరోపణలకు ఆధారాలు చూపడం బాధ్యత. అవినీతి జరిగిందని నిరూపిస్తే చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఆధారాలు లేకుండా రాజకీయ ఆరోపణలు చేసి రైతులను, ప్రజలను అయోమయానికి గురిచేయడం మానుకోవాలి. అభివృద్ధిని అడ్డుకునే రాజకీయాలకు ప్రజలే తగిన సమాధానం చెబుతారు" అని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు.

## సుప్రీం కోర్టులో మరో రెండు కోర్టు హాల్స్ ప్రారంభం

మొదటి పేజీ తరువాయి

సుప్రీం కోర్టులో నూతన కోర్టు హాల్స్, రిజిస్ట్రార్ కోర్టు హాల్స్ ప్రారంభమయ్యాయి. చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా సూర్యకాంత్ వీటిని ప్రారంభించారు. మరో రెండు రిజిస్ట్రార్ హాల్స్ కూడా అందుబాటులోకి వచ్చాయి. మెయిన్ క్యాంపస్‌లోని వెస్ట్ వింగ్ మొదటి అంతస్తులో వీటిని ఏర్పాటు చేశారు. ఈ మేరకు డిప్యూటీ రిజిస్ట్రార్ ఒక ప్రకటన జారీ చేశారు. ఇటీవల సుప్రీంకోర్టు జడ్జీల సంఖ్యను పెంచుతూ పార్లమెంట్ చట్ట సవరణ చేసిన విషయం తెలిసిందే. చీఫ్ జస్టిస్ సహా మొత్తం న్యాయమూర్తుల సంఖ్యను 38కి పెంచుతూ పార్లమెంట్ చట్ట సవరణ తీసుకొచ్చింది. రాష్ట్రపతి ఆమోదం అనంతరం కేంద్ర న్యాయశాఖ నోటిఫికేషన్ కూడా విడుదల చేసింది. బ్యాక్ లాగ్ కేసులు తగ్గించేందుకు వీలుగా పార్లమెంటు ఈ మేరకు చట్ట సవరణ చేసింది. ఈ నేపథ్యంలో న్యాయసేవలు మరింత సమర్థవంతంగా ప్రజలకు చేరేలా రెండు కొత్త కోర్టు హాళ్లను చీఫ్ జస్టిస్ ప్రారంభించారు.

## బీజేపీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ





మహబూబాబాద్ జిల్లా ఆగస్టు 13, సమయం ప్రతినిధి: ఈ రోజు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా యాత్రలో జాతీయ జెండాలతో స్వచ్ఛంద సంస్థలు లాయర్లు పాఠశాల విద్యార్థులు కళాశాల విద్యార్థులు దేశభక్తి నినాదాలు చేస్తూ పాల్గొన్నారు. విద్యార్థులు వందేమాతరం నినాదాలు చేసుకుంటూ స్వాతంత్ర సమరయోధుల త్యాగాలు తెలియజేస్తూ ర్యాలీగా ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి శ్రీధర్ మాట్లాడుతూ,,, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ "హర్ ఘర్ తిరంగా, హర్ మన్ తిరంగా" అనే సందేశంతో ప్రతి భారతీయుడి హృదయంలో దేశభక్తి భావాన్ని మరింత పెంపొందించుకోవాలని అన్నారు. ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయడం అనేది కేవలం ఒక కార్యక్రమం మాత్రమే కాదు, దేశం పట్ల మనకున్న గౌరవం, ప్రేమ, బాధ్యతను వ్యక్తపరిచే ఒక గొప్ప అవకాశం అని ఆయన వివరించారు.మహబూబాబాద్ జిల్లా బిజెపి అధ్యక్షులు వల్లభ వెంకటేశ్వర్లు జిల్లా కన్వీనర్ ఇందు భారతి మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటి మీద, ప్రతి గ్రామంలో, ప్రతి గల్లీలో పట్టణాలలో మన జాతీయ పతాకం రెపరెపలాడాలని, అన్నారు. భారతీయుడు త్రివర్ణ పతాకంతో వ్యక్తిగత అనుబంధాన్ని పెంపొందించుకోవాలని ప్రధాని పిలుపును తెలిపారు. ఈ కార్యక్రమం దేశ ఐక్యత, సమగ్రత, దేశభక్తికి ప్రతీకగా మారిందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ శ్యాంశర్మ మహబూబాబాద్ జిల్లా మాజీ అధ్యక్షులు ఒద్దిరాజు రామచంద్రరావు జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం అశోక్ మహబూబాబాద్ మున్సిపాలిటీ బిజెపి కౌన్సిలర్ భూక్య శ్రీదేవి బాలునాయక్ లాయర్ తుంపెల్లి శ్రీనివాస్ మైనార్టీ మోర్చా మహిళ అధ్యక్షురాలు రేష్మ మాజీ బిజెపి జిల్లా కార్యదర్శి చిట్టిమల్ల శ్రీను మహబూబాబాద్ టౌన్ ఉపాధ్యక్షులు పెద్ద బోయిన రవి స్వచ.


## గద్వాలలో భారీ ప్లాట్ల దందా: 'టెర్రా రూట్స్' వెంచర్ వెనుక పెద్ద స్కామ్..?!

సమయం ప్రతినిధి: జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలం పర్చర్ల స్టేజీ సమీపంలో సామాన్య ప్రజలను నట్టేట ముంచుతూ, ప్రభుత్వ ఖజానాకు కన్నం వేస్తున్న ఒక భారీ రియల్ ఎస్టేట్ దందా వెలుగులోకి వచ్చింది. "టెర్రా రూట్స్" (Terra roots) పేరుతో హనుమాన్ టెర్రా వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నడిపిస్తున్న ఈ అక్రమ వ్యాపారం ఇప్పుడు స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టిస్తోంది.

**లేఅవుట్ లేదు...పర్మిషన్ లేదు...అంతా మాయాజాలం!**
ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎలాంటి లేఅవుట్ పర్మిషన్ (LP No) తీసుకోకుండానే ఇక్కడ యథేచ్ఛగా ప్లాట్ల విక్రయాలు సాగుతున్నాయి. నిబంధనల ప్రకారం ప్రభుత్వానికి లేదా గ్రామ పంచాయతీకి అప్పగించాల్సిన 10 శాతం ఓపెన్ ల్యాండ్ (భూమి)ని సైతం ఇవ్వకుండా యాజమాన్యం నొక్కేసింది. కేవలం వ్యవసాయ పొలంలో రాళ్ళు పాతి, ఎలాంటి మౌలిక వసతులు, రోడ్లు వేయకుండానే ప్లాట్లుగా మార్చేసి అమాయక ప్రజలకు అంటగడుతున్నారు.

**రూ. 3.5 లక్షలకే గుంట.. ఉచ్చులో సామాన్యులు!**
నాలా కన్వర్షన్ లేకుండా, వ్యవసాయ భూములను ప్లాట్లుగా మార్చడం చట్టరీత్యా నేరం. అయినప్పటికీ ఈ సంస్థ రూ. 3.5 లక్షలకే 'గుంట' స్థలం ఇస్తామంటూ, మధ్యతరగతి ప్రజలను ఆకర్షించడానికి ఈఎంఐ ఆఫర్లు పెట్టింది. అంతేకాదు, ప్లాట్ కొంటే రూ. 20 లక్షల లైఫ్ ఇన్సూరెన్స్, రూ. 5 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ అంటూ రంగురంగుల బ్రోచర్లతో నమ్మబలుకుతూ మాయమాటలతో బురిడీ కొట్టిస్తోంది.

**ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి....అధికారుల నిర్లక్ష్యమేనా?**
ప్లాట్ల మాదిరిగా గుంటల లెక్కన రిజిస్ట్రేషన్లు చేస్తూ ప్రభుత్వానికి రావాల్సిన భారీ ఆదాయాన్ని, పన్నులను ఈ సంస్థ గోల్‌మాల్ చేస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ఈ 'పర్చర్ల ప్లాట్ల దందా'పై స్థానిక పంచాయతీ అధికారులు, రిజిస్ట్రేషన్ శాఖ




ఎందుకు కళ్ళు మూసుకున్నాయనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. సామాన్య ప్రజలు ఈ అక్రమ వెంచర్ మాయలో పడి మోసపోవద్దని, జిల్లా కలెక్టర్ గారు మరియు ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఈ వెంచర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై స్థానిక తాసిల్దార్ వివరణ కోరగా నిబంధనలకు విరుద్ధంగా ప్రజలకు గుంటల రూపంలో అమ్ముతున్న విషయం మా దృష్టికి వచ్చిందని కావున గుంటల రూపంలో ఫ్లాట్లు ఎవరు కొనవద్దని అది రిజిస్ట్రేషన్ కూడా ఇక్కడ చేయడం జరగదని స్పష్టం చేశారు కావున వెంచర్ల ప్లాట్లు కొన్ని ప్రతి ఒక్కరు అన్ని పరిశీలించి అనుమతులు ఉన్న వాటిని మాత్రమే కొనుగోలు చేయాలని తొందరపడి కొనుగోలు చేసి పైసలు ఖర్చు చేసుకొని మోసపోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ఆగస్టు 15న జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం

హైదరాబాద్: 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో తెలంగాణ శాసనసభ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు.ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 2026 ఆగస్టు 15న ఉదయం 9:30 గంటలకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరవుతారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరిస్తారు.భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా వివిధ జిల్లాల్లో జాతీయ పతాకావిష్కరణకు ప్రముఖులను ప్రభుత్వం నామినేట్ చేసింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో జరిగే వేడుకలకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డిని ప్రభుత్వం నియమించింది.జాతీయ పతాకావిష్కరణ అనంతరం ఆయన స్వాతంత్ర్య దినోత్సవ సందేశాన్ని అందించడంతో పాటు తెలంగాణ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై వివరాలను వెల్లడించనున్నారు.








# జూరాల ప్రాజెక్టును సందర్శించిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి...

(సమయం ప్రతినిధి) : రాయలసీమకు పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు సందర్శనకు వెళ్లిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి గురువారం నాడు గద్వాల నుండి జూరాల ప్రాజెక్టు మీదగా హైదరాబాద్ వెళ్లారు ఈ సందర్భంగా ఆయన జూరాల ప్రాజెక్టును సందర్శించారు అనంతరం మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడితూ రైతులకు నీళ్ళు ఇవ్వాలని ప్రభుత్వానికి అవగాహన,చిత్తశుద్ధి లేదని ఆగస్టు మాసంలో సాగు సీజన్ దాదాపు అయిపోయిందన్నారు. ఈ టైమ్ లో ఆ పంట ఈ పంట అంటే కాలం అయిపోతుందని నిన్నటి వరకు జూరాల వరద

## వానాకాలం సీజన్ కు నీళ్ళు ఇవ్వొచ్చు.. రైతులు గందరగోళానికి గురి చేయొద్దు

వచ్చిందని ఈ సీజన్ కు నీటి కొరత లేదు.కొరత ఉన్నట్లు క్రియేట్ చేస్తున్నారన్నారు.జూరాల నిండి ఉంది. ఈ స్థితిలో ఇబ్బంది లేదని ఎగువన కర్ణాటక లో 17 లక్షల ఎకరాలు సాగైతే ప్రతి రోజు ఐదారు వేల క్యూసెక్కులు జనవరి వరకు వస్తాయని వివరించారు. కోయిల్ సాగర్, బీమా, నెట్టెంపాడు లిఫ్టులు ఆన్ అండ్ అఫ్ పద్ధతిలో ఆపరేట్ చేస్తారని జూరాల చివరి ఆయకట్టు వరకు ఇప్పటికీ నీళ్లు పోలేదన్నారు. వానాకాలం సీజన్‌కు కూడా నీళ్లు ఇవ్వొద్దని అనుకుంటుందని ఇదేం అసమర్థత...ఇదేం నీటి నిర్వహణ..వీరికి అవగాహన లేకపోవడం వల్లే ఈ దుస్థితి ఏర్పడిందన్నారు. నిరంజన్ రెడ్డి వెంట గట్టు యాదవ్ బి.లక్ష్మయ్య,వాకిటి శ్రీధర్ , జగదీశ్వర్ రెడ్డి,పలుస రమేష్ గౌడ్,నందిమల్ల. అశోక్,కురుమూర్తి యాదవ్, గంధం. పరంజ్యోతి, మండల పార్టీ అధ్యక్షులు మాణిక్యం, వనం.రాములు, రాళ్ళ.కృష్ణయ్య,భీమన్న,కౌన్సిలర్ శ్రీకర్ గౌడ్,జోహెబ్ హుస్సేన్,ప్రేమ్ నాథ్ రెడ్డి,ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

# ఆయుష్ పీజీ వైద్య విద్యార్థులకు అలోపతి విద్యార్థులతో సమాన స్టైఫండ్ ఇవ్వాలి



## - బీఎస్పీ తెలంగాణా రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రాం శేఖర్

హైదరాబాద్ : ప్రాణాలను కాపాడే వైద్యులు సైతం తమ హక్కులు, న్యాయం కోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితి రావడం దురదృష్టకరం. ఆయుష్ పీజీ వైద్య విద్యార్థులు గత పది రోజులుగా అలోపతి వైద్యులతో సమానంగా తమకూ స్టైఫండ్ అందించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపడుతున్నారు. వారి న్యాయమైన డిమాండ్‌కు బహుజన్ సమాజ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రాం శేఖర్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ధర్నా చౌక్‌లో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఇబ్రాం శేఖర్ మాట్లాడుతూ, గత పది సంవత్సరాలుగా ఆయుష్ పీజీ వైద్య విద్యార్థుల స్టైఫండ్ విషయంలో వివక్ష కొనసాగుతోందని, గత మూడు సంవత్సరాలుగా సమస్య మరింత తీవ్రమైనప్పటికీ ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. గతంలో ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేస్తూ, అప్పటి పాలన రాక్షస పాలన అంటూ విమర్శలు చేసిన ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కఅధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఈ సమస్యను పరిష్కరించకపోవడం శోచనీయమని అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం న్యాయం చేసి ఉంటే ఆయుష్ పీజీ వైద్య విద్యార్థులు రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేయాల్సిన అవసరం ఉండేది కాదని ఆయన పేర్కొన్నారు. గతంలో ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా పనిచేసిన నాయకులు సైతం ప్రస్తుతం విద్యార్థుల సమస్యలను పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. ఒకే వృత్తి, ఒకే బాధ్యత, ఒకే విధమైన సేవలు అందిస్తున్న వైద్య విద్యార్థుల మధ్య స్టైఫండ్‌లో ఈ వివక్ష ఎందుకు? అని ప్రభుత్వాన్ని ఇబ్రాం శేఖర్ ప్రశ్నించారు. అలోపతి వైద్యులకు ఒక విధమైన స్టైఫండ్, ఆయుష్ వైద్యులకు మరో విధమైన స్టైఫండ్ ఇవ్వడానికి గల కారణాలను ప్రభుత్వం స్పష్టంగా వెల్లడించాలని, సమాన వృత్తికి సమాన స్టైఫండ్ అందించే విధంగా వెంటనే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో ఉన్న వివిధ పార్టీల ఎమ్మెల్యేలు – బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం, సీపీఐ ప్రజాప్రతినిధులు – ఆయుష్ పీజీ వైద్య విద్యార్థుల సమస్యపై ఏకతాటిపైకి వచ్చి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తే సమస్య పరిష్కారం కావడానికి అవకాశం ఉంటుందని ఆయన అన్నారు. రాజకీయ పార్టీలు హామీలు, మాటలకే పరిమితం కాకుండా విద్యార్థుల న్యాయమైన పోరాటానికి అండగా నిలవాలని కోరారు. ఆయుష్ పీజీ వైద్య విద్యార్థులు చేస్తున్న పోరాటానికి బీఎస్పీ తెలంగాణ రాష్ట్ర శాఖ పూర్తి మద్దతు ప్రకటిస్తోందని ఇబ్రాం శేఖర్ స్పష్టం చేశారు. అవసరమైతే ఆయుష్ విద్యార్థులు పెద్ద ఎత్తున ధర్నా, ఆందోళనకు సిద్ధమైతే బీఎస్పీ తరఫున 10 వేల మంది కార్యకర్తలతో సంపూర్ణ మద్దతు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని మీడియా సాక్షిగా ప్రకటించారు. అదేవిధంగా అలోపతి వైద్యులు కూడా ఆయుష్ పీజీ వైద్య విద్యార్థుల న్యాయమైన పోరాటానికి మద్దతు ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వైద్య రంగంలో పనిచేసే ప్రతి ఒక్కరికీ సమాన గౌరవం, సమాన హక్కులు, న్యాయమైన పారితోషికం అందే వరకు బీఎస్పీ వారి పక్షాన నిలబడుతుందని ఇబ్రాం శేఖర్ స్పష్టం చేశారు. “ఆయుష్ పీజీ వైద్య విద్యార్థులకు వివక్ష కాదు – న్యాయం కావాలి. సమాన వృత్తికి సమాన స్టైఫండ్ ఇవ్వాలి.” అని ఆయన డిమాండ్ చేశారు.


# విద్యలో డిజిటల్ అంతరాన్ని తగ్గించాలి

(సమయం ప్రతినిధి) : డిజిటల్ ఇండియా కార్యక్రమం 2026 జూలై 1 నాటికి విజయవంతంగా పదకొండు సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఈ కాలంలో దేశవ్యాప్తంగా డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ) గణనీయంగా విస్తరించింది. గ్రామీణ బ్రాడ్‌బ్యాండ్ సేవల విస్తరణ, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, ఈ-పాలన, దేశీయ ఎలక్ట్రానిక్ తయారీ వంటి రంగాల్లో విశేష పురోగతి సాధించింది. ఈ విజయాలు ప్రశంసనీయమైనవే. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలోనూ, కోట్లాది మంది పౌరులను డిజిటల్ వ్యవస్థలో భాగస్వాములను చేయడంలోనూ ఇవి కీలక పాత్ర పోషించాయి. తెలుగు రాష్ట్రాలు కూడా డీపీఐని వినియోగించుకోవడంలో గణనీయమైన పురోగతిని సాధించాయి. డిజిటల్ పాలన, ఆర్థిక సమ్మిళితత, ఇంటర్నెట్ అనుసంధానాన్ని విస్తరించడంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ముందడుగు వేశాయి. అయినా, నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం ఈ రెండు రాష్ట్రాల్లోనూ డిజిటల్ వ్యవస్థ ప్రధానంగా పట్టణ ప్రాంతాల్లోనే కేంద్రీకృతమై ఉంది. తెలంగాణలో డిజిటల్ అభివృద్ధి ఎక్కువగా నగరాలకే పరిమితమవగా, ఆంధ్రప్రదేశ్‌లో ఇంటర్నెట్ వినియోగం పెరిగినా గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ విద్యా ఫలితాల్లో అసమానతలు కొనసాగుతున్నాయి. ఇంకా అనేక ప్రభుత్వ పాఠశాలల్లో తగిన కంప్యూటర్ ల్యాబ్‌లు, విశ్వసనీయమైన ఇంటర్నెట్ సౌకర్యం, ఆధునిక డిజిటల్ అభ్యాస వనరులు అందుబాటులో లేవు. ఈ పరిస్థితిని వెంటనే సరిదిద్దకపోతే గ్రామీణ విద్యార్థులు ఉన్నత విద్య, ఉపాధి అవకాశాల్లో మరింత వెనుకబడే ప్రమాదం ఉంది. అందుబాటులో ఉన్న అన్ని మార్గాలనూ వినియోగించి విద్యార్థులకు డిజిటల్ సౌకర్యాలు కల్పించేందుకు రెండు రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలి. ప్రజా గ్రంథాలయాలు, డిజిటల్ అభ్యాస కేంద్రాలు, కమ్యూనిటీ కంప్యూటర్ కేంద్రాలు విస్తృత స్థాయిలో ఏర్పాటు చేస్తే మరింత మంది విద్యార్థులకు సాంకేతికత అందుబాటులోకి వస్తుంది. ప్రైవేటు సంస్థలు, విశ్వవిద్యాలయాలు, సేవా సంస్థల భాగస్వామ్యంతో వెనుకబడిన ప్రాంతాల్లో డిజిటల్ మౌలిక సదుపాయాలను వేగంగా అభివృద్ధి చేయవచ్చు. అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యాసంస్థలకు అధిక వేగం గల ఇంటర్నెట్ సౌకర్యాన్ని కల్పించాలి. అలాగే డిజిటల్



తరగతి గదులు, స్మార్ట్ బోర్డులు, ఆన్‌లైన్ అభ్యాస వేదికలను ప్రోత్సహించాలి. ఈ పరికరాలు ఏడాది పొడవునా వినియోగంలో ఉండేలా వాటి నిర్వహణకు కూడా తగిన ప్రాధాన్యం ఇవ్వాలి. విద్యా సంస్థలు ప్రాంతీయ భాషల్లో డిజిటల్ పాఠాలు, వీడియోలు, వర్చువల్ ల్యాబ్‌లు, పరస్పర క్రియాశీల అభ్యాస మాడ్యూళ్లను అభివృద్ధి చేయాలి. స్థానిక అవసరాలకు అనుగుణమైన డిజిటల్ విద్యా కంటెంట్ లేకపోవడం కూడా సాంకేతికతను బోధన-అభ్యాసన ప్రక్రియలో సమర్థవంతంగా వినియోగించడంలో ప్రధాన అవరోధంగా ఉంది. ప్రస్తుతం చాలా తక్కువ మంది ఉపాధ్యాయులే డిజిటల్ సాంకేతికతను అర్థవంతంగా తరగతి గదుల్లో వినియోగిస్తున్నారు. వీరిలో కూడా చాలామంది తగిన శిక్షణ, అనుభవం లేకపోవడం వల్ల దానిని బోధనలో సమర్థవంతంగా అనుసంధానించలేకపోతున్నారు. అందువల్ల ఉపాధ్యాయులకు నిరంతర వృత్తిపరమైన డిజిటల్ శిక్షణా కార్యక్రమాలను నిర్వహించి, నైపుణ్యాలను అందించాలి. డిజిటల్ అంతరాన్ని తగ్గించడానికి ప్రభుత్వాలు, విద్యాసంస్థలు, ప్రైవేటు రంగం, పౌర సమాజం సమష్టిగా, దీర్ఘకాలిక దృష్టితో కృషి చేయాలి.

# సంఘటన్ సృజన్ అభియాన్ వన్-టు-వన్ సమావేశంలో పాల్గొన్న టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏపి మిథున్ రెడ్డి



హైదరాబాద్ : సంఘటన్ సృజన్ అభియాన్ (SSA)లో భాగంగా ఏఐసీసీ ఆధ్వర్యంలో హైదరాబాద్ గాంధీ భవన్‌లో నిర్వహించిన వన్-టు-వన్ సమావేశంలో ఏపి మిథున్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్‌తో సమావేశమై పార్టీ సంస్థాగత బలోపేతం,క్షేత్రస్థాయిలో పార్టీ కార్యక్రమాల అమలు,కమిటీల పనితీరు,కార్యకర్తల సమన్వయం తదితర అంశాలపై చర్చించారు. 29-06-2025 నుంచి నిర్వహించిన పార్టీ బాధ్యతలు,చేపట్టిన కార్యక్రమాలు,సంస్థాగత కార్యకలాపాలు మరియు కమిటీలకు సంబంధించిన వివరాలను సమర్పిస్తూ,పార్టీని బూత్ స్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై అభిప్రాయాలను పంచుకున్నారు. కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్టం చేసి, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా ఏపి మిథున్ రెడ్డి తెలిపారు.

## పిగ్లీపురంలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి శంకుస్థాపన

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 13 (వేకువ సమయం ప్రతినిధి): రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని పిగ్లీపురం గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు గ్రామ సర్పంచ్ కోట ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. గ్రామంలో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపనతో పాటు ఇందిరమ్మ ఇంటి ప్రారంభోత్సవం తదితర కార్యక్రమాలు ఎమ్మెల్యే చేతుల మీదుగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజల సహకారంతో అనతి కాలంలోనే పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. గ్రామంలో వీధిలైట్లు ఏర్పాటు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, తాగునీటి సమస్య పరిష్కారం, డ్రైనేజీ సమస్యల నివారణ, సీసీ రోడ్ల నిర్మాణం తదితర పనులు చేపట్టినట్లు సర్పంచ్ వివరించారు. స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో భవిష్యత్‌లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి పిగ్లీపురం గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోట ప్రభాకర్‌రెడ్డి, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొననున్నారు.

## 23న అమర చింతలో శ్రావణ మాసం సందర్భంగా హనుమాన్ చాలీసా పారాయణ




అమరచింత : ఈరోజు విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి, శ్రావణమాసంలో నిర్వహించనున్న ఆధ్యాత్మిక సమ్మేళనం, స్వామీజీ పర్యటన, కార్యక్రమం నిర్వహించే స్థలం, తేదీ తదితర అంశాలపై చర్చించారు.ఈ సమావేశానికి పాలమూరు విభాగ్ సత్సంగ్ రాచాల జనార్ధన్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమానికి సంబంధించిన విషయాలను చర్చించి నిర్ణయించారు. ఈ సమావేశానికి విశ్వ హిందూ పరిషత్ పెద్దలు హాజరయ్యారు.ఈనెల 23వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు అమరచింత పట్టణ ప్రజల క్షేమాన్ని కోరుతూ సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ధీరజ్ చిన్న స్వామి అమరచింత పట్టణానికి విచ్చేయనున్నారు. కావున హిందూ బంధువులు, మహిళలు, అన్ని దేవాలయాల కమిటీ సభ్యులు, ఆంజనేయ స్వామి భక్తులు, అయ్యప్ప భక్తులు,శివ భక్తులు రామ భక్తులు మరియు భక్తులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని అమరచింత రామాల యంలో జరిగే ఈ పవిత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. అనంతరం మధ్యాహ్నం అన్న ప్రసాద కార్యక్రమం కూడా నిర్వహించనున్నట్లు విహెచ్ పి పెద్దలు తెలిపారు.






# ప్రజావాణి ద్వారా సమస్యలను పరిష్కరించి ప్రజలు మన్ననలు పొందాలి

**మండల నోడల్ అధికారుల (560 మంది ఎం.పీ.డీ.వో.లు) శిక్షణ కార్యక్రమం పాల్గొన్న చిన్నారెడ్డి, విద్యాసాగర్, వేముల శ్రీనివాసులు, దివ్య దేవరాజన్**

**-ప్రజలకు అధికారులు జవాబుదారులు**

**అంకిత భావంతో ప్రజల సమస్యలను పరిష్కరించాలి**

**సీఎం రేవంత్ రెడ్డి నమ్మకాన్ని ఎం.పీ.డీ.వో.లు నిలబెట్టాలి**

**రాష్ట్ర స్థాయి ప్రజావాణి ఇంచార్జ్ డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి**

హైదరాబాద్ : ప్రజలకు జవాబుదారులం అనే విషయాన్ని అధికారులు ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించవద్దని, ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతి అధికారి అంకితభావం, బాధ్యతతో విధులు నిర్వహించాలని రాష్ట్ర స్థాయి ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. గురువారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో నిర్వహించిన మండల నోడల్ అధికారులైన ఎంపీడీవోల (560 మంది) శిక్షణ కార్యక్రమానికి డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం గ్రామాల నుంచి వచ్చే ప్రజలతో ఓపికగా మాట్లాడి వారి నుంచి దరఖాస్తులు స్వీకరించి వాటిని క్షేత్రస్థాయిలోనే పరిష్కరించే గురుతర బాధ్యత మండల నోడల్ అధికారి, వివిధ శాఖల మండల అధికారులపై ఉందని పేర్కొన్నారు. ప్రజలే దేవుళ్ళని వారికి సేవలు అందించడం అధికారుల కనీస బాధ్యత అని చిన్నారెడ్డి గుర్తు చేశారు. ఎంపీడీవో లకు మండల ప్రజావాణి నోడల్ అధికారిగా ఎంతో నమ్మకంగా నియమించిన ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి విశ్వాసాన్ని వారు నిలుపుకోవాలని, ప్రజావాణి ద్వారా సమస్యలను పరిష్కరించి ప్రజల మన్ననలు పొందాలని చిన్నారెడ్డి పిలుపునిచ్చారు. ప్రజావాణి పేదవారి సమస్యల పరిష్కార వేదికగా మారాలని ఆయన అన్నారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్న సీఎం ప్రజావాణి 75% సక్సెస్ రేటును సాధించిందని, ఇదే స్థాయిలో సమస్యలకు పరిష్కరిస్తూ జిల్లా, మండల స్థాయి ప్రజావాణి అదుకారులు కృషి చేయాలని చిన్నారెడ్డి సూచించారు. మండల స్థాయి ప్రజావాణిలో బాధ్యతలు నిర్వహించే అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని, విధి నిర్వహణలో ఎలాంటి లోపం లేకుండా చర్యలు తీసుకోవాలని చిన్నారెడ్డి పేర్కొన్నారు. ఈనెల 17 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా తొలిసారిగా ప్రారంభం కానున్న మండల స్థాయి ప్రజావాణి కార్యమాలకు అన్ని ఏర్పాట్లు ముందస్తుగా పూర్తి చేసుకుని సిద్ధంగా ఉండాలని చిన్నారెడ్డి సూచించారు. సీఎం ప్రజావాణి మాదిరిగానే మండల స్థాయిలోనూ శాఖల వారీగా డెస్క్ లు, ప్రజల దరఖాస్తులు రాసేందుకు హెల్ప్ డెస్క్ లు, వైద్య సేవలు, తాగు నీరు ఏర్పాట్లు చేసుకోవాలని, వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని చిన్నారెడ్డి అన్నారు. స్టేట్ నోడల్ అధికారి కే. విద్యాసాగర్ మాట్లాడుతూ ప్రజలు మాస్టర్స్ అని, అధికారులు సేవకులు అన్న విషయాన్ని గుర్తు పెట్టుకుని ప్రజావాణి బాధ్యులు ప్రజల సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు. అధికారులు పబ్లిక్ సర్వేంట్స్ అన్న ప్రాథమిక సూత్రాన్ని విస్మరించవద్దని అన్నారు. మండల, జిల్లా నోడల్ అదుకారులు ఆఫీస్ లో ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రజల సమస్యలను పరిష్కరించడం కర్తవ్యంగా భావించాలని విద్యాసాగర్ సూచించారు. ముఖ్యమంత్రి కార్యాలయంలో ప్రజావాణి వ్యవహారాల పర్యవేక్షకులు, సీఎం ఓ.ఎస్.డీ. వేముల శ్రీనివాసులు గారు మాట్లాడుతూ ఎన్నో సమస్యలతో ప్రజావాణికి వచ్చే ప్రజలకు సాంత్వన కల్పించాలని రాష్ట్రంలోని ఎంపీడీవో లకు సూచించారు. మండల నోడల్ అధికారి, మిగతా శాఖల అధికారులు ప్రజల విశ్వాసాన్ని చురగొనాలని వేముల శ్రీనివాసులు గారు పేర్కొన్నారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల కమిషనర్ దివ్య దేవరాజన్ గారు మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చే ప్రజల సమస్యలను ఓపికగా వింటే సగం సమస్య పరిష్కారం అయినట్లేనని, సమస్యల పరిష్కారం కోసం గట్టి చర్యలు చేపట్టాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో భాగంగా మండల స్థాయిలో ప్రజావాణి నిర్వహణకు తీసుకోవాల్సిన అనేక అంశాలను పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా నిపుణులు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రణాళిక శాఖ డైరెక్టర్ షేక్ మీరా, సీఎం ప్రజావాణి ఏ.సీ.పీ. ఉమేందర్, డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ అధికారి సుశీల, సీఎం ప్రజావాణి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర వేడుకలకు వనపర్తి జిల్లాకు మహేందర్ రెడ్డి రాక



వనపర్తి, సమయం ప్రతినిధి: 80వ భారత స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ మహేందర్ రెడ్డి వనపర్తి జిల్లాకు ప్రభుత్వం తరపున ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆయన ఆగస్టు 15 న సమీకృత కార్యాలయాల సముదాయంలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, స్థానిక శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి, ఎస్పీ తదితరులతో కలిసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, సందేశాన్ని అందింస్తారు.

## 5వ నేషనల్ కరాటే, కుంగ్ ఫూ తైక్వాండో ఛాంపియన్ షిప్ ట్రోఫీ మెడల్స్ & సర్టిఫికెట్స్ ఆవిష్కరణ



మహబూబ్‌నగర్ : శ్రీ హనుమాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో తేదీ 23 ఆగస్టు 2026 ఆదివారం నాడు హెచ్.బి.ప్యాలెస్, జిల్లా జైలు ఎదురుగా నిర్వహించనున్న 5వ నేషనల్ కరాటే, కుంగ్ ఫు మరియు తైకాండో చాంపియన్ షిప్ ట్రోఫీ మెడల్స్ మరియు సర్టిఫికెట్స్‌ను ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షులు,ప్రముఖ న్యాయవాది, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎన్.పి.వెంకటేష్, న్యాయవాది ఎన్.పి.నేహా శ్రీ, ట్రోఫీ మెడల్స్ సర్టిఫికెట్స్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమములో శ్రీ హనుమాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకుడు కోటకద్ర వెంకటేశ్, సీనియర్ కరాటే మాస్టర్ కోటకద్ర నర్సింలు, సతీష్,మహేందర్ శ్రీనివాసులు, కే.శివశంకర్, కే.బాల గోపి పాల్గొన్నారు.

## చంద్ర నాయక్ తాండా గ్రామ పంచాయతీ భవనానికి 3 గుంటల భూమి దానం ??

**ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు భూమి సమకూర్చిన దాతలు**

(సమయం ప్రతినిధి అమరచింత) : అమరిచింత మండలం చంద్ర నాయక్ తాండా గ్రామ పంచాయతీ భవన నిర్మాణం కోసం మొత్తం 3 గుంటల పట్టా భూమిని దాతలు గ్రామ పంచాయతీకి దానం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి భూమి అవసరాన్ని గుర్తించి దాతలు ముందుకు రావడం అభినందనీయమని గ్రామస్తులు పేర్కొన్నారు.

**భూమి దానం చేసిన దాతలు:**

గ్రామ సర్పంచ్ కృష్ణ నాయక్ తల్లి జయమ్మ, W/o రాములు నాయక్ – 2 గుంటల భూమి గ్రామ బీజేపీ అధ్యక్షుడు వి. రమేష్ నాయక్, తండ్రి తౌర్యా నాయక్ – 1 గుంట భూమి గ్రామ పంచాయతీ పేరుతో భూమి రిజిస్ట్రేషన్ పూర్తైన అనంతరం, ఈరోజు తహసీల్దార్ & జాయింట్ సబ్ రిజిస్ట్రార్ రవి కుమార్ సంబంధిత పట్టాలను గ్రామ పంచాయతీ కార్యదర్శి ఏ. సుచిత్ర మేడంకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కృష్ణ నాయక్, 3వ వార్డు సభ్యులు కుర్మా నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి విలువైన భూమిని దానం చేసిన జయమ్మ గ, వి. రమేష్ నాయక్ కి చంద్ర నాయక్ తాండా గ్రామ సర్పంచ్ కృష్ణ నాయక్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం దాతలు చేసిన ఈ సేవ అభినందనీయమని, వారి సహకారం ఎప్పటికీ గుర్తుండిపోతుందని సర్పంచ్ పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధికి సహకరించిన దాతలకు సర్పంచ్ కృష్ణ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## ప్రైవేట్ బస్సును ఢీకొన్న కంటైనర్ లారీ.. ఇద్దరు మహిళల మృతి

సమయం ప్రతినిధి : జిల్లాలోని ఆర్మూర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. గోవింద్‌పేట్ ఫ్లై ఓవర్‌పై ఆగి ఉన్న ప్రైవేట్ బస్సును కంటైనర్ లారీ వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మహిళలు ప్రాణాలు కోల్పోయారు. ప్రైవేటు బస్సు టైర్ పంక్చర్ అవడంతో బస్సును డ్రైవర్ రోడ్డుపై నిలిపాడు. ఈ క్రమంలో ఇద్దరు మహిళలు బస్సు ఎదుట ఉన్న డివైడర్‌పై కూర్చుకున్నారు. ఇదే సమయంలో అతివేగంతో దూసుకొచ్చిన కంటైనర్ లారీ.. వెనుక నుంచి బస్సును ఢీకొట్టింది. ఈ క్రమంలో బస్సు ముందు డివైడర్‌పై కూర్చున్న మహిళలపైకి బస్సు టైర్ ఎక్కడంతో వారు అక్కడికక్కడే మృతి చెందారు.

## ప్రభుత్వ గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు అందేలా చర్యలు తీసుకోవాలి

**-కొత్తకోట మండలం అమడబాకులలో మైనారిటీ గురుకుల కళాశాలలో వసతులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



వనపర్తి, సమయం ప్రతినిధి : కొత్తకోట మండలం అమడబాకులలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి గురువారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థులకు అందుతున్న వసతులు, విద్యా బోధన, నిర్వహణ తీరును ఆయన పరిశీలించారు. ముందుగా కళాశాలలోని స్టాక్ రూమ్‌ను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న నిత్యావసర సరుకుల నాణ్యత, నిల్వలు, సరఫరా వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేసిన ఆయన, సరుకులకు సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నమోదు చేసి నిర్వహించాలని సూచించారు. అనంతరం కళాశాలలోని భోజనశాలను సందర్శించిన కలెక్టర్, అక్కడి పరిశుభ్రత, పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందేలా చూడాలని, భోజనశాల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తదుపరి విద్యార్థులతో కలెక్టర్ ముఖాముఖిగా మాట్లాడి కళాశాలలో అందుతున్న విద్య, వసతులు, భోజనం, ఇతర సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు కళాశాలలో ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని సూచించారు. భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహించేలా స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని విద్యార్థులకు కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కళాశాలలో నెలకొన్న విద్యుత్ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, విద్యార్థుల సౌకర్యార్థం ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, విద్యుత్ సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటుకు కూడా అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విద్యార్థుల విద్యా ప్రగతితో పాటు వారి ఆరోగ్యం, భద్రత, సౌకర్యాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ డి ఎస్ సి కార్పొరేషన్ సిరాజుద్దీన్, ఇతర అధికారులు తదితరులు, కలెక్టర్ వెంట ఉన్నారు.

## మహిళా బిల్లు చుట్టూ కాంగ్రెస్ రాజకీయం

సమయం ప్రతినిధి : పార్లమెంట్‌లో ‘మహిళా ప్రాతినిధ్యం, నియోజకవర్గాల డీలిమిటేషన్’ చుట్టూ జరుగుతున్న వివాదాన్ని తీవ్రమైన రాజకీయ యుద్ధంగా మార్చింది కాంగ్రెస్. పైకి మహిళల హక్కుల గురించి మాట్లాడే కాంగ్రెస్ పార్టీ చరిత్రను పరిశీలిస్తే, మహిళా బిల్లు విషయంలో ఆ పార్టీ ప్రదర్శించిన ద్వంద్వ వైఖరి, తాత్సారం, రాజకీయ స్వార్థం... వంటివి ఎన్నో కనిపిస్తాయి. ఇప్పుడు మహిళా బిల్లుకు డీలిమిటేషన్‌ను కారణంగా చూపిస్తున్న కాంగ్రెస్, 2004 నుంచి 2014 వరకు పదేళ్ల పాటు యూపీఏ అధికారంలో మిత్రపక్షాల ఒత్తిడిని సాకుగా చూపిస్తూ బిల్లును లోక్‌సభలో ఆమోదించకుండా కాలయాపన చేసింది. 2010లో రాజ్యసభలో పాసైన బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టకుండా తొక్కిపెట్టింది. మహిళా బిల్లును కాంగ్రెస్ రాజకీయం చేయడం 1996లో దేవెగౌడ మొదటిసారి బిల్లు పెట్టినప్పటి నుంచి జరుగుతూనే ఉంది. యూపీఏ హయాంలో తమ మిత్రపక్షాలైన సమాజ్‌వాది, ఆర్జేడీలు సభలో బిల్లును వ్యతిరేకిస్తూ ఓబీసీ, మైనారిటీ కోటా ఉండాలని బిల్లు ప్రతులను చించేస్తే అధికార భాగస్వామి కాంగ్రెస్, ఆ నిరసనలకు నిశ్శబ్ద ప్రేక్షక పాత్రకే పరిమితమైంది. ఇప్పుడు ముప్పై సంవత్సరాల తర్వాత కూడా మహిళా బిల్లు మీద స్పష్టమైన రాజకీయ వైఖరి తీసుకోకుండా, ఏదో ఒక నెపంతో మహిళా హక్కులను వాయిదా వేస్తోంది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ‘రాజ్యాంగ 131వ సవరణ బిల్లు–2026 ద్వారా లోక్‌సభ స్థానాల సంఖ్యను 543 నుంచి 850కి పెంచాలని ప్రతిపాదన; ప్రస్తుతం కేవలం 14శాతం ప్రాతినిధ్యంతో ఉన్న మహిళలు 128వ రాజ్యాంగ సవరణ బిల్లు–2023, మహిళా రిజర్వేషన్ల బిల్లుతో 33శాతం స్థానాలతో సుమారు 280 పైగా స్థానాలకు పెంచే ప్రతిపాదన గత ఏప్రిల్ 17న లోక్‌సభ ఓటింగ్‌లో 2/3 వంతుల మెజారిటీ లభించక ‘ఇండియా’ కూటమి వ్యతిరేక ఓటుతో వీగిపోయింది. దక్షిణాది ప్రాతినిధ్యం తగ్గకుండా, ఏ రాష్ట్రానికీ సీట్లు తగ్గకుండా, మొత్తం సీట్ల సంఖ్యను మాత్రమే పెంచుతూ, 1971 జనాభా నిష్పత్తి ఆధారంగా దక్షిణాది స్థానాల శాతాన్ని యథాతథంగా కాపాడుతూ సీట్లు పెంచే ప్రత్యామ్నాయ ఫార్ములాపై కాంగ్రెస్, విపక్షాలు వారి అభ్యంతరమేమిటో ఇప్పటికీ చెప్పలేదు. ఒకవైపు రాహుల్‌గాంధీ జనాభా ప్రాతిపదికన హక్కులు (జిత్నీ ఆబాదీ, ఉత్నీ హక్) అంటూ నినాదం ఇస్తారు. మరొకవైపు జనాభా ప్రాతిపదికన జరిగే డీలిమిటేషన్‌ను అడ్డుకుంటారు! 2023 సెప్టెంబర్‌లో మోదీ ప్రభుత్వం తెచ్చిన మహిళా బిల్లు ‘నారీ శక్తి వందన్ అధినియం’ 106వ రాజ్యాంగ సవరణ చట్టం ఆమోదం పొందింది. అయితే, రాజ్యాంగంలో కొత్తగా చేర్చిన ఆర్టికల్ 334ఏ స్పష్టమైన నిబంధన విధిస్తోంది. అది కొత్త జనాభా గణన, దాని ఆధారంగా జరిగే నియోజకవర్గాల సరిహద్దుల పునర్విభజన, డీలిమిటేషన్ పూర్తయిన తర్వాతే ఈ 33శాతం రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయి. లోక్‌సభ–ఆర్టికల్ 330ఏ; రాష్ట్ర అసెంబ్లీలతో ఆర్టికల్ 332ఏ తో పాటు ఎస్సీ, ఎస్టీ మహిళలకు ఉప రిజర్వేషన్లు కల్పిస్తూ, 15 ఏళ్ల పరిమితితో సన్‌సెట్ క్లాజ్, స్థానాల రొటేషన్ పద్ధతిని స్పష్టంగా చట్టంలో పొందుపరిచారు. ఈ రాజ్యాంగబద్ధమైన డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తికాకుండా రిజర్వేషన్లు వెంటనే అమలు చేయమనడం కాంగ్రెస్ చట్టపరమైన నైతికత లేని రాజకీయ విన్యాసమే. డీలిమిటేషన్ తర్వాతే, ఆమోదించిన మహిళా బిల్లు అమల్లోకి వస్తుంది. ఒకప్పుడు మహిళా బిల్లును ఆమోదించిన కాంగ్రెస్ పార్టీ, మరి ఈ రోజు, డీలిమిటేషన్ లేకుండా మహిళా బిల్లును ఆమోదించాలని ఎలా అడుగుతోంది? ఒకవేళ 2026 జనాభా లెక్కల ప్రకారం జనగణన చేస్తే దక్షిణాదికి లోక్‌సభ సీట్లలో తీవ్ర అన్యాయం జరుగుతుందనే కదా ఇప్పుడు సమస్య. ఆ సమస్యను అసలు పట్టించు కోకుండా, కాంగ్రెస్ సారథ్యంలో కొన్ని ప్రతిపక్షాలు ఏకమై బిల్లును ఓడగొట్టాయి. పైగా కొత్తగా కాంగ్రెస్ ఇప్పుడు డిమాండ్ చేస్తున్న ఓబీసీ కోటాను 2010లో యూపీఏ ప్రవేశపెట్టిన బిల్లులో తామే చేర్చలేదు. గతంలో తాము అధికారంలో ఉన్నప్పుడు లేని ఓబీసీ కోటా డిమాండ్‌ను కాంగ్రెస్ ఇప్పుడు తెరపైకి ఎలా తెస్తున్నది? అసలు డీలిమిటేషన్ లేకుండా మహిళా బిల్లు సాధ్యమేనా అంటే, చట్ట ప్రకారం చెల్లదు. ఈ రెండింటినీ వేరు చేయాలని రాహుల్‌గాంధీ, ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. కానీ ప్రాథమిక రాజ్యాంగ, సాంకేతిక పరిజ్ఞానం ఉన్న ఎవరికైనా అర్థమయ్యే విషయం ఏమిటంటే, నియోజకవర్గాల సరిహద్దులు మార్చకుండా ఏ సీటు మహిళలకు, ఏ రాష్ట్రంలో ఎంత కేటాయించాలో నిర్ణయించడం అసాధ్యం. డీలిమిటేషన్ లేకుండా 33శాతం కేటాయించాలంటే, ప్రస్తుతం ఉన్న 543 స్థానాల్లో నుంచే 181 స్థానాలను లాటరీ పద్ధతిలో మహిళలకు ఇవ్వాలి. దీనివల్ల రాష్ట్రాల నియోజకవర్గాల సరిహద్దుల్లో, మహిళా ప్రాతినిధ్యంలో, భారీ అసమానతలు వస్తాయి. అసలు కొత్త సీట్లు 850 వరకు విస్తరించకుండా, పాత స్థానాల్లోనే ఇస్తే సిట్టింగ్ ఎంపీల స్థానాలు ఊడిపోయి, తీవ్ర గందరగోళం ఏర్పడుతుంది. ఈ ఆచరణాత్మక సమస్యను కాంగ్రెస్ గమనించడం లేదు. 1976లో ఎమర్జెన్సీ సమయంలో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా పునర్విభజనపై ఇందిరాగాంధీ 2001 వరకు నిషేధం విధించారు. 2001లో వాజపేయి ప్రభుత్వం దీనిని 2026 వరకు పొడిగించింది. జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలు పార్లమెంట్‌లో తమ సీట్లను కోల్పోకుండా ఉంచాలని తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు నుంచి ప్రముఖ రాజకీయ పార్టీలన్నీ డిమాండ్ చేయడంతో ఆ నిర్ణయం తీసుకున్నారు.







# మహిళా సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట : దేవరకద్ర ఎమ్మెల్యే జియంఆర్

దేవరకద్ర : కొత్తకోట మండల ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన కొత్తకోట మండల మహిళా సమైక్య సర్వసభ్య సమావేశంలో మరియు ఇందిరా మహిళా శక్తి 23వ వార్షిక మహాసభ సమావేశంలో దేవరకద్ర ఎమ్మెల్యే శ్రీ జి. మధుసూదన్ రెడ్డి (GMR) పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే జియంఆర్ .మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేలా ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళా సంఘాలను కేవలం పొదుపు సంఘాలుగా చూడటం లేదని వారిని ఆర్థిక శక్తిగా, వ్యాపార శక్తిగా తీర్చిదిద్దాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళలు సొంతంగా వ్యాపారాలు, ఉపాధి కార్యక్రమాలు చేపట్టి ఆర్థికంగా ఎదిగేలా ప్రోత్సహిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. మహిళా సంఘాలకు బ్యాంకు రుణ లింకేజీ, వడ్డీ లేని రుణాలు అందిస్తూ వారి ఆర్థిక అవసరాలకు అండగా నిలుస్తున్నామని, మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు మంచి మార్కెట్ లభించేలా నైపుణ్య శిక్షణ, బ్రాండింగ్, ప్యాకేజింగ్, మార్కెటింగ్ సదుపాయాలను కల్పిస్తున్నామని, మహిళలు వారి ఉత్పత్తులను అమ్ముకోవడానికి శిల్పారామంలో స్టాల్స్ ఏర్పాటు చేశామని వివరించారు. "ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మినీ ఇండస్ట్రియల్ పార్కులు, కామన్ ప్రాసెసింగ్ సెంటర్లు ఏర్పాటు చేయడం ద్వారా మహిళలకు స్థానికంగానే ఉపాధి, ఆదాయ అవకాశాలు పెంచుతున్నామని అన్నారు. మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు మహిళా శక్తి క్యాంటీన్లు, అలాగే అమ్మ ఆదర్శ





పాఠశాలల నిర్వహణలో మహిళా సంఘాలను భాగస్వాములను చేశామని, పాఠశాల యూనిఫాంల కుట్టు పనులు కూడా మహిళా సంఘాలకు అప్పగించడం ద్వారా వారికి నిరంతర ఉపాధి కల్పిస్తున్నామని చెప్పారు."మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలన్నదే మా ప్రభుత్వ ఆలోచనని అందుకే ఆర్టీసీ బస్సుల నిర్వహణ, యాజమాన్య అవకాశాలు కూడా మహిళా సంఘాలకు కల్పించామని, ఇందిరమ్మ ఇండ్లు కూడా మహిళల పేరు మీద ఇచ్చామని అన్నారు. మహిళా సంఘాల సభ్యులకు ప్రమాద బీమా, రుణ బీమా వంటి సామాజిక భద్రత కల్పించి వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు."మహిళలు ఎదిగితే కుటుంబాలు ఎదుగుతాయని.. కుటుంబాలు ఎదిగితే గ్రామాలు, సమాజం అభివృద్ధి చెందుతాయని తెలిపారు, అందులో భాగంగానే కొత్తకోట మండలంలోని మిరాస్ పల్లి వద్ద మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ ప్రారంభించమని తెలిపారు. VVOA ల జీతాల పెంపుకు సంబంధించి అసెంబ్లీలో ప్రస్తావిస్తానని తెలియజేసారు.

# 'వరి' వృద్ధికి కారణం 'కాళేశ్వరం' కాదు!

సమయం ప్రతినిధి : తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత, 2014లో సుమారు 47 లక్షల ఎకరాలుగా ఉన్న వరి సాగు విస్తీర్ణం, 2025 నాటికి కోటి 20లక్షల ఎకరాలకు పెరిగింది. వరి సాగు విస్తరణ ద్వారా దేశంలో రాష్ట్రం అగ్రగామిగా నిలిచినా, రైతుల ఆదాయం ఆశించిన స్థాయిలో పెరగకపోవడం, సహజ వనరుల నాణ్యత, లభ్యత గణనీయంగా క్షీణించడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. మరోవైపు, వరిలో నమోదైన ఈ గణనీయమైన వృద్ధి గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన కాళేశ్వరం వంటి నీటిపారుదల ప్రాజెక్టుల వల్లే సాధ్యమైందని కొన్ని రాజకీయ వర్గాలు ప్రచారం చేస్తున్నాయి. అయితే, వరి పెరుగుదలకు ఈ ప్రాజెక్టులతో సంబంధం లేదని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మరోవైపు, గత పదేళ్లలో ఎకరాకు వరి దిగుబడిలో కూడా చెప్పుకోదగ్గ మార్పు కనిపించలేదు. మరి ఈ పరిస్థితుల్లో వరి ఉత్పత్తిలో నమోదైన ఈ గణనీయమైన వృద్ధికి అసలు కారణాలేమిటి?

మొదటి కారణం: గత పదేళ్లలో మెరుగైన ఋతుపవనాల కారణంగా సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదవడం. 2016-17 నుంచి 2025-26 వరకు తెలంగాణలోనే కాకుండా యావత్ భారతదేశంలో కూడా మెరుగైన ఋతుపవనాల ప్రభావంతో సాధారణ సగటు కంటే అధిక వర్షపాతం నమోదైంది. దాంతో దేశవ్యాప్తంగా వరి విస్తీర్ణం, ఉత్పత్తి గణనీయంగా పెరిగాయి. 2015-16లో దేశంలో సుమారు 11 కోట్ల ఎకరాల్లో ఉన్న వరి విస్తీర్ణం, 2025-26 నాటికి 14 కోట్ల ఎకరాలకు పెరిగింది. ఈ పెరుగుదలలో దాదాపు 77 లక్షల ఎకరాలు (అంటే సుమారు 25 శాతం) కేవలం తెలంగాణలోనే విస్తరించింది. తద్వారా తెలంగాణలో వరి ఉత్పత్తి కూడా ఇదే కాలంలో 78 లక్షల టన్నుల నుంచి 270 లక్షల టన్నులకు పెరిగింది. ఉత్పాదకత (ఎకరాకు దిగుబడి) పెరగడం వల్ల ఈ వృద్ధి నమోదు కాలేదు. తెలంగాణలో వరి ఉత్పత్తిలో నమోదైన గణనీయమైన పెరుగుదలకు ప్రధాన కారణం సాగు విస్తీర్ణం పెరగడమే తప్ప, ఉత్పాదకత హెచ్చడం కాదు.

రెండో కారణం: గత దశాబ్దంలో తెలంగాణలో సగటు కంటే అధిక వర్షపాతం నమోదవడంతో భూగర్భ జలాలు గణనీయంగా పెరిగాయి. ఈ అనుకూల పరిస్థితులు రైతుల్లో భూగర్భ జలాల లభ్యతపై విశ్వాసాన్ని పెంచి, కొత్త బోరు బావుల తవ్వకానికి ప్రోత్సాహాన్ని కల్పించాయి. 2014లో రాష్ట్రంలో సుమారు 16 లక్షల బోరు బావులు ఉండగా, 2023--24 నాటికి వాటి సంఖ్య 31 లక్షలకు చేరుకుంది. ఒక బోరు బావికి సుమారు రూ.2 లక్షల వ్యయమవుతుందని అంచనా. ఈ లెక్కన గత పదేళ్లలో రైతులు సొంత పెట్టుబడులతో అదనంగా ఏర్పాటుచేసిన బోరు బావులపై రూ.30 నుంచి రూ.35 వేల కోట్లు పెట్టుబడి పెట్టారు. ఇది తెలంగాణ వ్యవసాయ చరిత్రలో రైతులు స్వయంగా చేసిన అతిపెద్ద మూలధన పెట్టుబడుల్లో ఒకటి. ఒక బోరు బావి సగటున 2--3 ఎకరాలకు సాగునీటిని అందిస్తుందని పరిగణిస్తే, కొత్తగా ఏర్పడిన 15 లక్షల బోరు బావుల ద్వారా అదనంగా సుమారు 35 నుంచి 40 లక్షల ఎకరాలలో సాగు పెరిగింది. ఈ అంచనాకు రాష్ట్ర నికర సాగునీటి విస్తీర్ణంలో నమోదైన పెరుగుదల కూడా బలాన్ని ఇస్తోంది. 2014 రాష్ట్ర నికర సాగునీటి విస్తీర్ణం 57 లక్షల ఎకరాలు కాగా, 2023--24 నాటికి అది 92 లక్షల ఎకరాలకు పెరిగింది.

## రంగనాయక స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే




దేవరకద్ర : దేవరకద్ర మండలం వెంకటయ్యపల్లి గ్రామంలో శ్రీ. రంగనాయక స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో సతీ సమేతంగా పాల్గొని స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి, స్వామివారిని దేవరకద్ర ఎమ్మెల్యే శ్రీ జి. మధుసూదన్ రెడ్డి (GMR) దర్శించుకున్నారు. అనంతరం దేవాలయం పైకి వెళ్లేందుకు సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు ఆంజనేయస్వామి దేవాలయం వద్ద నూతన షెడ్డును ఎమ్మెల్యే జియంఆర్ ప్రారంభించారు. తదనంతరం జీకే మాస్టర్ షోటోకాన్ కరాటే డు - ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే బెల్ట్ ప్రధానోత్సవ కార్యక్రమంలో పాల్గొని, కరాటేలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కరాటే బెల్టులను పంపిణీ చేసి వారిని ఎమ్మెల్యే అభినందించారు.

# పాలించే 'ప్రభువు' కాదు, కలిసి పనిచేసే 'గుంపు మేస్త్రి'!

సమయం ప్రతినిధి : తెలంగాణ సమాజంలో దశాబ్దాలుగా అధికారం అంటే 'పాలించడం' అనీ, నాయకుడు అంటే 'ప్రభువు' అనే భావజాలం బలంగా నాటుకుపోయింది. ఈ నేపథ్యంలో, ప్రజల్లోంచి వచ్చిన నాయకుడు, తెలంగాణ మట్టి వాసన తెలిసిన పోరాట యోధుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా తనను తాను 'గుంపు మేస్త్రీ'గా అభివర్ణించుకోవడం కొందరికి కొత్తగా, మరికొందరికి ఆశ్చర్యంగా అనిపించింది. దశాబ్దాల రాజకీయ భాషకు భిన్నంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్న తీరు, స్పందిస్తున్న తీరు, ప్రజలను కలుపుకుపోతున్న తీరు సామాన్యులకు చేరువయ్యింది. తన సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన మొదటి రోజు నుంచి ప్రజల అవసరాలే కేంద్రంగా ప్రజోపయోగ, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను చేపడుతూ జననాయకుడిగా నిరూపించుకున్నారు రేవంత్‌రెడ్డి.

ఆయన వ్యాఖ్యలను ఆసరాగా చేసుకుని కొందరు ప్రతిపక్ష నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని 'గుంపు మేస్త్రీ' అని సంబోధిస్తూ ఆ పదాన్ని అవహేళన చేస్తున్నారు. శ్రమించి పైకొచ్చిన నాయకుడిని, జనంలోంచి ఎదిగిన నేతను అలా హేళన చేయడం వారి రాజకీయ దివాళాకోరుతనానికి, దొరతనపు అహంకారానికి, గడీల మనస్తత్వానికి నిదర్శనం. దొరతనంతో ప్రజలను ఏలాలనుకునే అహంకారపు విధానాలకు కాలం చెల్లిందనీ, ప్రజల కష్టాల్లో తోడూ నీడై నిలుస్తూ, శ్రమనే అభివృద్ధికి మూలాధారంగా భావిస్తూ, ప్రజా చైతన్యాన్ని సన్మార్గంలో నడిపించే 'గుంపు మేస్త్రీ' భావజాలమే తెలంగాణ స్వేద సంస్కృతికి, ప్రజాస్వామ్య రక్షణకు నిజమైన ప్రతీక అనీ తెలంగాణ సమాజం భావించింది. ఇది చరిత్రలో ఎన్నోసార్లు నిరూపితమైంది కూడా. మన తెలంగాణ గడ్డ శ్రమకు, స్వేదానికి పట్టంగట్టే నేల. ఇక్కడ కోటలు, రాచరికాలు నిలబడలేదు. చెమట చుక్కల పునాదులపై నిర్మించబడే సమాజమే నిలబడింది.

ఒక భవనాన్ని నిర్మించడానికి ఇటుకలు పేర్చే కూలీల నుంచి సిమెంట్ కలిపే పనివారి వరకు అందరినీ సమన్వయం చేస్తూ, సరైన దిశానిర్దేశం చేసి నిర్మాణాన్ని పూర్తిచేసే బాధ్యత మేస్త్రీదే. అందుకే మేస్త్రీ అనేది కేవలం ఒక వృత్తిని సూచించే పదం కాదు. సమష్టి శక్తిని ఒకే లక్ష్యం వైపు నడిపించే నాయకత్వానికి, శ్రమ సంస్కృతికి ప్రతీక. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనను తాను



'గుంపు మేస్త్రీ'గా అభివర్ణించుకోవడం వెనుక ఇదే భావన ఉంది. తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణంలో తాను ఒక ప్రధాన శ్రామికుడినే తప్ప ప్రభువును కాదని ఆయన పలు సందర్భాల్లో స్పష్టం చేశారు. పాలనను దొరతనానికి ప్రతీకగా కాకుండా, ప్రజలందరూ కలిసి చేసే ఒక నిర్మాణాత్మక ప్రక్రియగా నిర్వచించిన తీరు ఆయనలోని శ్రమ సంస్కృతి తాత్వికతను స్పష్టంగా ప్రతిబింబిస్తోంది. 'గుంపు' అనేది ప్రజలకు ప్రతీక అయితే, 'మేస్త్రీ' ఆ ప్రజల ఆకాంక్షలకు రూపమిచ్చే సమన్వయకర్తకు ప్రతీక. ప్రజాస్వామ్యం ఒక వ్యక్తి సంకల్పంతో నడిచే వ్యవస్థ కాదు. ముఖ్యమంత్రి, మంత్రులు, శాసనసభ్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, కార్మికులు, యువత, పలు రంగాల నిపుణులు, కోట్లాది మంది ప్రజలు కలిసి ఒక సమష్టి శక్తిగా మారినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుంది. ఆ సమష్టి సంకల్పానికి దిశానిర్దేశం చేస్తూ, అందరినీ ఒకే లక్ష్యం వైపు నడిపిస్తూ, రాష్ట్ర నిర్మాణానికి రూపురేఖలు ఇవ్వడమే నిజమైన నాయకత్వం. ఒక్క వ్యక్తి కృషి కంటే అందరినీ కలుపుకొని ముందుకు సాగే నాయకత్వమే గొప్ప ఫలితాలను ఇస్తుంది. 'గుంపు మేస్త్రీ' అనే భావన కూడా ఇదే తత్వాన్ని ప్రతిబింబిస్తుంది. ఒక భవనం నాణ్యతకు మేస్త్రీ ఎంతగా బాధ్యత వహిస్తాడో, ఒక రాష్ట్ర పునర్నిర్మాణం కూడా అంతే బాధ్యతతో ముందుకు సాగాలి. మేస్త్రీ ఎప్పుడూ ఏసీ గదుల్లో కూర్చొని ఆదేశాలు ఇవ్వడు. ఎండనకా, వాననకా పని జరిగే చోటే ఉండి పర్యవేక్షిస్తాడు. అందరినీ కలుపుకొని ముందుకు సాగుతాడు. బలహీనమైన పునాదులను బలోపేతం చేసి, బలమైన నిర్మాణానికి పునాది వేస్తాడు. అదే విధంగా ప్రజల మధ్య ఉంటూ, వారి సమస్యలను అర్థం చేసుకొని, ప్రభుత్వ యంత్రాంగాన్ని సమన్వయం చేస్తూ, సమష్టి కృషితో రాష్ట్రాన్ని ముందుకు నడిపించే బాధ్యత నాయకుడిదే. గత పాలకులు ప్రజలను తమ శాసనాలకు లొంగి ఉండే పాలిత వర్గంగా చూశారు. కానీ రేవంత్‌రెడ్డి నాయకత్వం ప్రజలను రాష్ట్ర నిర్మాణంలో భాగస్వాములుగా మారుస్తోంది. ప్రజల కష్టసుఖాలు తెలిసిన నాయకుడు మాత్రమే తనను తాను 'గుంపు మేస్త్రీ' అని ధైర్యంగా చెప్పుకోగలడు. నాడు ఒక పార్టీ కార్యకర్తగా రాజకీయ జీవితాన్ని ఆరంభించి, జడ్పీటీసీగా, ఎమ్మెల్సీగా, ఎమ్మెల్యేగా, ఎంపీగా, నేడు ముఖ్యమంత్రి స్థాయికి చేరుకోవడం వ్యక్తిగత విజయగాథ మాత్రమే కాదు. శ్రమను గౌరవించే సంస్కృతి, ప్రజా ఉద్యమాల స్ఫూర్తి, ప్రజాస్వామ్యం అందించే సామాజిక చలనశీలతకు ఇదొక చారిత్రక వ్యక్తీకరణ. శ్రమ, క్రమశిక్షణ, ప్రజల విశ్వాసం కలిస్తే సాధారణ మనిషి కూడా అత్యున్నత స్థాయికి చేరుకోగలడనే సత్యాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్థానం నిరూపిస్తుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో 'తెలంగాణ పునర్నిర్మాణం' అనే గొప్ప యజ్ఞంలో మేమంతా భాగస్వాములమే. ఒక మేస్త్రీ నిర్మాణ పనిలో ప్రతి కార్మికుడి శ్రమను సమన్వయం చేస్తూ లక్ష్యాన్ని చేరుకున్నట్లే, ముఖ్యమంత్రి నాయకత్వంలో మంత్రివర్గం, ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజల సహకారంతో ఒకే లక్ష్యం కోసం కృషి చేస్తున్నాం.




**అమెరికా ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలను బయటి దేశాలవారే ఎక్కువగా పొందుతున్నారనే ఉద్దేశంతో ఆ పథకాలపై ఆధారపడి జీవిస్తున్న వలసదారుల లెక్కలు తీసింది ట్రంప్ ప్రభుత్వం. ఈ లెక్కల ఆధారంగా ఏకంగా 75 దేశాల పౌరులకు కొత్తగా అమెరికా రావడానికి అవసరమైన వీసా ప్రాసెసింగ్‌ను నిలిపివేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఏ దేశమైనా సొంత పౌరుల కోసమే ప్రభుత్వ ధనాన్ని వెచ్చించి సంక్షేమ పథకాలకు రూపకల్పన చేస్తుంది. కానీ నిబంధనల్లో లొసుగుల్ని వాడుకుంటూ ఆ ప్రయోజనాల్ని ఇతరులు గరిష్ఠంగా కాజేస్తోంటే ఎవ్వరైనా ఏం చేస్తారో ట్రంప్ కూడా అదే చేశారు. గమనించాల్సిన అంశం ఏంటంటే పాకిస్థాన్, బంగ్లాదేశ్, నేపాల్‌తో పాటు, రష్యా వంటి దేశాలు కూడా ఈ జాబితాలో ఉన్నాయి. భారత్ మాత్రం ఈ జాబితాలో లేదు.**

# అది మన ఆత్మగౌరవ సంకేతం!

అమెరికాలో అడుగుపెడుతున్న భారతీయులు తమ నైపుణ్యాలు, సామర్థ్యాల మీద ఆధారపడి బతుకుతున్నారే తప్ప, అమెరికా ప్రభుత్వపు దయాదాక్షిణ్యాల మీద కాదని దీన్ని బట్టి స్పష్టమవుతోంది. ట్రంప్ నిర్ణయం కొందరికి కంటగింపుగా కనిపించవచ్చు. అధికారికంగా వీసా ప్రాసెసింగ్ నిలిపివేయకుండా కేవలం వీసాలు తిరస్కరిస్తూ వచ్చినా ఇంత చర్చ జరిగేది కాదు. కానీ ట్రంప్ తాను ఆయా దేశాలను వెలివేస్తున్నట్టు స్పష్టం చేయదల్చుకున్నారు కనుకనే ఈ నిర్ణయం తీసుకున్నారు. అమెరికాలో ఉంటున్న ఆయా దేశాలకు చెందిన వలసదారులు అక్కడి సంక్షేమ పథకాలన్నింటినీ హైజాక్ చేసేస్తుండటం ఆ తీవ్ర నిర్ణయానికి దోహదం చేసింది. ఈ జాబితాలో అమెరికాతో పోటీపడగల అగ్రదేశం అని చెప్పుకునే చైనా నుంచి చిన్న దేశాల వరకు అనేకం ఉన్నాయి... మనం తప్ప! అమెరికాలోని భారతీయుల ఆత్మగౌరవాన్ని ఇనుమడింపజేసే అంశం అది. అమెరికన్లు కూడా మనల్ని గౌరవించి తీరాల్సిన సంగతి ఇది. అమెరికన్ వ్యవస్థకు భారతీయులు కంట్రిబ్యూట్ చేస్తున్నారే తప్ప, అమెరికా నుంచి వారు తీసుకునే విధంగా లేరు. ఇందుకు భారతీయుల జీవన విధానంలోని క్రమశిక్షణ, ఆర్థిక వనరుల నిర్వహణ, తమ కాళ్లపైనే తాము నిలబడాలనుకునే ధోరణి ఒక కారణం. భారతీయ వలసదారులు ఎక్కువగా నైపుణ్య ఆధారిత, ఉన్నత వేతనాలు గల రంగాల్లోనే ఉన్నారు. సాంకేతిక, వైద్య, ఇంజనీరింగ్, పరిశోధన, వ్యాపార రంగాల్లో పనిచేస్తున్నారు. ఇవి స్థిరమైన ఆదాయం ఇచ్చే ఉద్యోగాలు. కాబట్టి ప్రభుత్వ సహాయం, పథకాలను అర్థించే స్థితిలో భారతీయులు లేరు. ప్యూ రీసెర్చ్ సెంటర్ ప్రకారం, 2023 నాటికి అమెరికాలో సుమారు 52 లక్షల మంది భారతీయులు నివసిస్తున్నారు. అమెరికాలోని అన్ని ప్రధాన వలస సమూహాల్లో భారతీయుల కుటుంబాల సగటు ఆదాయం అత్యధికం. 2023లో ఆసియా–అమెరికన్ కుటుంబాల సగటు ఆదాయం సుమారు లక్షా అయిదు వేల డాలర్లుగా ఉన్నా, భారతీయుల ఆదాయం దానికన్నా ఎక్కువ. భారతీయుల నేతృత్వంలోని కుటుంబాల సగటు వార్షిక ఆదాయం లక్షా యాభై వేల డాలర్లకు పైగా ఉంది. ఇది అమెరికా జాతీయ సగటును మాత్రమే కాదు, ఇతర వలసదారుల సగటును కూడా దాటింది. ఈ అధిక ఆదాయం కారణంగా భారతీయులు స్థానిక, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు భారీగా పన్నులు చెల్లిస్తున్నారు. ఆర్థికంగా చూస్తే, వారు వ్యవస్థ నుంచి తీసుకునేదాని కంటే ఎక్కువగా అందిస్తున్నారు. అందుకే భారతీయ అమెరికన్లను 'నికర కంట్రిబ్యూటర్లు'గా ఆర్థిక నిపుణులు పిలుస్తున్నారు. వలస విధానాలు ఎలా ఉంటే ఫలితాలు ఎలా ఉంటాయన్న దానికి భారత్ మంచి ఉదాహరణ. నైపుణ్యాలు, ఉపాధి సామర్థ్యం, విద్యకు ప్రాధాన్యం ఇచ్చిన వలస మార్గాలు సమాజాన్ని బలపరుస్తాయి. ఆర్థిక వ్యవస్థను నిలబెడతాయి. ఇటు సొంత దేశాన్ని, అటు వలస వెళ్లిన దేశాన్ని కూడా గౌరవప్రద స్థితిలో ఉంచుతాయి. అమెరికాలో భారతీయ వలసదారులు ఎక్కువగా సంపాదిస్తున్నారు, ఎక్కువగా పన్నులు చెల్లిస్తున్నారు, అక్కడి ప్రభుత్వ సహాయంపై తక్కువగా ఆధారపడుతున్నారు. అన్ని దేశాల వీసా ప్రాసెసింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేయడం ఒక రకంగా అమెరికాలోని భారతీయులకు సానుకూలాంశం అయ్యే అవకాశం ఉంది. ఉద్యోగాధారిత గ్రీన్ కార్డుల జారీ విషయంలో ఇది ఎన్నారైలకు కలిసొచ్చే సంగతి. ఈ దేశాల వీసాలు ఆగిపోవడం వలన, ఈ ఏడాది సెప్టెంబరు నాటికి కొత్తగా యాభై వేలకు పైగా గ్రీన్ కార్డ్ స్లాట్స్ ఖాళీ అవుతాయి. ఈ 75 దేశాలకు చెందినవారు గ్రీన్ కార్డ్ స్లాట్స్‌ను వినియోగించుకోలేరు. ఆ పరిణామం భారత్ వంటి దేశాల వారు త్వరగా గ్రీన్ కార్డులు పొందే ప్రక్రియను వేగవంతం చేయవచ్చు.

# 'డచ్ రోగం' ముదిరేనా?


**ప్రపంచంలోనే అత్యంత అరుదైన, అపారమైన ఖనిజ నిల్వలకు చిరునామా భారతదేశం. దేశ సజీవ, నిర్జీవ సహజ వనరుల్లో (అటవీ సంపద, ఖనిజం= మినరల్, ముడి ఖనిజం= ఓర్) అత్యధిక శాతం వింధ్య పర్వతాలకు దిగువనున్న దక్షిణాపథంలో (దక్కన్ ద్వీపకల్పం, తమిళనాడు, కేరళ, కర్ణాటక భూభాగాలతో సహా శ్రీలంక, మాల్దీవుల వరకు) విస్తరించి ఉందన్న విషయం తెలిసిందే. శతాబ్దాల నుంచి చారిత్రకంగా కదంతాల్ స్థితిలో కొనసాగుతున్న 'గోండ్వానా' ఆదివాసీల నివాస ప్రాంతంగా, వారిని సంఘటితం చేసిన మావోయిస్టుల ప్రభావిత ప్రాంతంగా 45 ఏళ్ళకు పైగా ఉన్నందున... ఈ విలువైన సహజ వనరులు, మానవ వనరులు దేశీయ, ప్రపంచ మార్కెట్‌తో అనుసంధానం కాలేదు.**

2026 మార్చి నాటికి దక్షిణాపథంలో మావోయిస్టు తీవ్రవాదాన్ని అంతమొందించడంలో భాగంగా అనేక రూపాల్లో సాయుధ ఆపరేషన్లను కేంద్రం నిర్వహించింది. వాటికి పరాకాష్ఠగా 'ఆపరేషన్ కగార్' కేంద్రంగా 'డిసిసివ్ డికేడ్: ఎండింగ్ లెఫ్ట్ వింగ్ ఎక్స్‌ట్రీమిజం' అనే సైనిక వ్యూహాన్ని కేంద్రం వేగంగా చేపట్టడంతో మావోయిస్టు ఉద్యమం పూర్తి స్థాయిలో అంత్య దశకు చేరుకుంది. దాంతో గణనీయమైన స్థాయిలో మానవ వనరులు, సహజ వనరులు దేశ, విదేశీ మార్కెట్లకు అందుబాటులోకి వచ్చాయి. వీటి వాణిజ్యం (స్వదేశీ, విదేశీ) ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతుందని, వాణిజ్యం వివృతమై, అపార సంపదలు సమాజంలోకి విదేశీ మారక నిల్వల రూపంలో ప్రవహిస్తాయన్న పాలకుల స్వప్నం సాకారమవుతుందా?

స్వాతంత్ర్యానంతరం తొలి 3 దశాబ్దాలు కొనసాగిన 'హిందూ వృద్ధిరేటు' అనే ఆర్థిక బాలారిష్టంలో కూరుకుపోయి, గణనీయమైన నిర్మాణాత్మక పరిణామానికి ఇండియా ఆర్థిక వ్యవస్థ నోచుకోలేదు. తొలినాళ్ళలో ప్రభుత్వరంగ ఉద్యోగుల భారీ నియామకం వల్ల వ్యవసాయం, వస్తూత్పత్తి పారిశ్రామిక రంగాల అభివృద్ధి క్రమం పెద్దఎత్తున కుంటుపడింది. ఆ తరువాత 1980–2015 కాలంలో ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న 7–8 దేశాల్లో ఒకటిగా నిలిచింది. 1980లలో ప్రారంభమై ఇండియాలో సేవా రంగం–ఐటీ అపార వృద్ధి; అమెరికా, కెనడా, ఆస్ట్రేలియాలకు నైపుణ్యం ఉన్న ఉద్యోగుల వలసలు; మధ్య ఆసియా, ఆగ్నేయాసియా, ఇంగ్లండ్ తదితర దేశాలకు అనిపుణ, అర్ధనిపుణ కార్మికుల వలసల కారణంగా దేశంలోకి విదేశీ మారక ద్రవ్యం ప్రవహించింది. దీంతో దేశీయ కరెన్సీ బలపడి, ఇండియా ఎగుమతులు అంతర్జాతీయ మార్కెట్‌లో ఖరీదైనవిగా మారి, వాటి డిమాండ్ తగ్గడంతో వాణిజ్యం దెబ్బతింది. పర్యవసానంగా వ్యవసాయం, వస్తూత్పత్తి రంగాలు కుదేలై, దిగుమతులు పెరిగాయి. సేవల రంగం, అధిక వేతనాలిచ్చే ప్రభుత్వ రంగాల కారణంగా శ్రమశక్తి వనరుల లభ్యత దేశీయ మార్కెట్‌లో కొరవడింది. దాంతో వస్తూత్పత్తి రంగం నష్టదాయకంగా మారడమే కాకుండా, ఉపాధి అవకాశాలు గణనీయంగా సన్నగిల్లాయి.

1990లలో ప్రపంచీకరణ విధానాలను వేగంగా అమలు చేయడం వల్ల దేశంలోకి ప్రత్యక్ష విదేశీ అర్థ మదుపులు(ఎఫ్‌డీఐ), విదేశీ సంస్థాగత మదుపులు, ప్రవాసీలు పంపే ధనం... పర్యవసానంగా విదేశీ మారకద్రవ్య నిల్వలు పెరగడంతో ఇండియా కరెన్సీ విలువ క్షీణత నెమ్మదించింది. దేశంలో అవసరాలకు మించిన కరెన్సీ ఆర్థిక వ్యవస్థలో ప్రవహించడంతో అనేక ప్రతికూల పరిణామాలు చోటుచేసుకున్నాయి. ప్రధానంగా మనది గ్రామీణ వ్యవసాయ ఆధారిత దేశం కావడంతో భారీ స్థాయి ఆర్థిక విధ్వంసక పరిణామాలు చోటుచేసుకోలేదు. అయితే వ్యవసాయం తీవ్ర సంక్షోభంలోకి కూరుకుపోయి రైతులు అధిక సంఖ్యలో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. చేతివృత్తులు ధ్వంసం కావడంతో పెద్ద ఎత్తున గ్రామీణ నిరుద్యోగం ప్రబలి, పట్టణాలకు వలసలు కడుతున్నారు. పట్టణాల్లో శ్రామికులు అత్యంత దుర్భరమైన పరిస్థితుల్లో బతుకులీడుస్తున్నారు. దేశ అవసరానికి మించి వివిధ రూపాల్లో ప్రవహించిన విదేశీ మారక ద్రవ్యం, ప్రభుత్వరంగ ఉద్యోగాల గణనీయమైన అభివృద్ధి, ఆ తర్వాత ఐటీ రంగం పెరగడం వల్ల దిగుమతులు విపరీతంగా పెరిగి, స్వదేశీ వస్తూత్పత్తి రంగం కుదేలయింది. దాంతో నిరుద్యోగం పెరిగి, జీవన ప్రమాణాలు దారుణంగా పడిపోయాయి.

ఆర్థిక వ్యవస్థలో ఒక రంగం తీవ్రమైన వృద్ధి రేటు సాధించడం వల్ల వస్తూత్పత్తి, ఎగుమతుల రంగాలు క్షీణించాయి. విదేశీ మారక రేటులో దేశీయ ద్రవ్యం విలువ ప్రపంచ మార్కెట్ అవసరాలకు మించడంతో ఎగుమతులు ప్రియమై పోటీతత్వం సన్నగిల్లింది. దాంతో స్వదేశీ వాణిజ్య శక్తులు లాభదాయక రంగంపై అధికంగా ఆధారపడ్డాయి, ఇతర రంగాలు దెబ్బతిని, ఉద్యోగాలు ఆవిరై కొనుగోలు శక్తి క్షీణించింది. దీన్ని నిలువరించేందుకు వైవిధ్యభరితమైన, సమతుల్యమైన ఆర్థిక విధానాలను ప్రభుత్వాలు రూపొందించాలి. అంతవరకు, ఉత్తర––దక్షిణ భారతం అభివృద్ధి వ్యత్యాసాలు, ఘర్షణలు వంటి ప్రాంతీయ అసమానతలు, అభివృద్ధి రేటు కుంటుపడడం వంటి దుష్పరిణామాలు చోటుచేసుకుంటాయి. ఆర్థిక వ్యవస్థలో ఏర్పడే ఇలాంటి సంక్షోభాన్ని 'డచ్ రోగం' అని పిలుస్తారు. ఇండియాలో ప్రధానంగా ద్రవ్య, ఐటీ తదితర సేవల రంగం పునాదిగా ఈ రోగం ఏర్పడింది. ఇది మొదటిసారిగా 1960లలో ఆయిల్, గ్యాస్ నిల్వలు కనుగొని, వాటి వ్యాపారంపై డచ్ (నెదర్లాండ్స్) దేశ ఆర్థిక వ్యవస్థ మోహరించడం వల్ల మొదట్లో ఆర్థిక ప్రగతికి లాభదాయకంగా ఉన్న ఏక రంగం కేంద్రిత ఆర్థిక విధానం, కరెన్సీ బలపడి డచ్ సరుకులు అంతర్జాతీయ విపణిలో ప్రియమయ్యాయి. ఎగుమతులు దిగనాశిల్లడంతో వస్తూత్పత్తి రంగం కుదేలు కావడం, ఉపాధి ఆవిరవడంతో దేశం త్రీవ ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. అప్పటి నుంచి ఈ ఆర్థిక రుగ్మతకు 'డచ్ రోగం'



అని పేరొచ్చింది.

నైజీరియా, వెనెజువెలా దేశాల్లో ఆయిల్ వ్యాపారం; ఇండియాలో ఫైనాన్స్, ఐటీ వంటి సేవల రంగాలలో అభివృద్ధి కారణంగా; ఆస్ట్రేలియాలో మైనింగ్ కార్యకలాపాలపై కేంద్రీకరణ; గల్ఫ్ దేశాల్లో ఆయిల్ వాణిజ్య ఆదాయాల కారణంగా ఆ దేశాలు కూడా 'డచ్ రోగం' బారిన పడ్డాయి. 'కగార్ యుద్ధం' పర్యవసానంతో దేశంలో (దక్షిణాపథం దండకారణ్యం) గణనీయమైన స్థాయిలోని సహజ/ శ్రమశక్తి వనరులు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్ రంగాలకు అందుబాటులోకి వస్తున్నాయి. ఇప్పటికే జాతీయ, ప్రపంచ ఆర్థిక సంక్షోభం 2007 నుంచి కొనసాగుతున్న నేపథ్యంలో దాని పరిష్కారంగా మార్కెట్/ కార్పొరేట్ శక్తులు కొత్తగా అందుబాటులోకి వచ్చిన వనరులు లాభదాయకమని భావించి, ఆ రంగం వైపు మదుపులను పెద్దఎత్తున మళ్లిస్తాయి. దాంతో వస్తూత్పత్తి రంగం భయంకరంగా దెబ్బతిని, నిరుద్యోగం ఎక్కువై 'డచ్ రోగం' ఇంకా భీకరంగా ప్రబలేందుకు మావోయిస్టుల నిర్మూలన కార్యక్రమం కూడా దోహదమయ్యే సంభావ్యతను కాదనలేం. సహజ/ శ్రమశక్తి వనరుల వాణిజ్య ఆదాయం విదేశీ మారకద్రవ్యం రూపంలో దేశ ఆర్థిక వ్యవస్థలోకి వచ్చే ప్రవాహం... సహజ వనరుల వాణిజ్య ఆధారిత 'డచ్ రోగం' ఏర్పడేందుకు దారితీసే ప్రమాదం ఉంది. దాంతో ఇప్పటికే ఉన్న ద్రవ్య, ఐటీ తదితర సేవలరంగ డచ్ రోగానికి ఇది జత అయితే, దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయే ప్రమాదం ఉంది.




మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రి డిశ్చార్జ్ అయ్యారు. ఇటీవలే ఆయన భుజానికి గాయం కాగా, బుధవారం కిమ్స్ ఆసుపత్రిలో ఆర్థ్రోస్కోపిక్ షోల్డర్ సర్జరీ పూర్తయిన సంగతి తెలిసిందే. ఆ శస్త్రచికిత్స విజయవంతం కావడం, ఆయన ఆరోగ్యం మెరుగుపడటంతో.. గురువారం ఆయనను ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేసినట్లు కిమ్స్ యాజమాన్యం అధికారికంగా హెల్త్ బులిటెన్ విడుదల చేసింది. డాక్టర్ ఆర్.ఎ. పూర్ణచంద్ర తేజస్వి, డాక్టర్ నితిన్ బెజ్జంకి లీడ్ చేసిన వైద్యుల బృందం ఎన్టీఆర్‌కు ఈ సర్జరీని సమర్థవంతంగా నిర్వహించింది. ఎన్టీఆర్ ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన సందర్భంగా కిమ్స్ హాస్పిటల్ సీఎండీ డాక్టర్ భాస్కర్ రావు ఆయన త్వరగా, పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రస్తుతం ఎన్టీఆర్ ఆరోగ్యం చాలా బాగుందని, వైద్యుల పర్యవేక్షణలోనే పూర్తిస్థాయి రికవరీ కోసం ప్రత్యేకమైన రిహాబిలిటేషన్ ప్రోగ్రామ్ ప్రారంభించనున్నారని మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ సంబిత్ సాహు పేర్కొన్నారు. ఎన్టీఆర్ సురక్షితంగా ఇంటికి చేరుకోవడంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తూ సోషల్ మీడియా వేదికగా ఆయనకు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లుగా కామెంట్స్ చేస్తున్నారు. మరోవైపు ఎన్టీఆర్‌కు జరిగిన ఈ సర్జరీ కారణంగా ఆయన నటిస్తోన్న 'డ్రాగన్' చిత్ర షూట్‌కు అంతరాయం ఏర్పడిందని తెలుస్తోంది. అంతేకాదు, ఎన్టీఆర్ కోలుకుని మళ్లీ షూట్‌లోకి వచ్చే వరకు దర్శకుడు ప్రశాంత్ నీల్.. మరో ప్రతిష్టాత్మక చిత్రం 'సలార్ 2'పై దృష్టి పెట్టనున్నట్లుగా కూడా టాక్ నడుస్తోంది. మరి ఇది ఎంత వరకు నిజం అనేది మాత్రం క్లారిటీ రావాల్సి ఉంది. ప్రస్తుతానికైతే ఎన్టీఆర్ సర్జరీ పూర్తి చేసుకుని, డిశ్చార్జ్ అవడంతో.. త్వరలోనే ఆయన మళ్లీ నార్మల్‌గా షూట్‌లో పాల్గొంటారని ఫ్యాన్స్ భావిస్తున్నారు.




వయస్సు అనేది కేవలం ఒక నంబర్ మాత్రమే అని చాలామంది అంటుంటారు. కానీ, దానిని ప్రాక్టికల్‌గా నిరూపించి చూపిస్తున్నారు సూపర్ స్టార్ రజనీకాంత్. ప్రస్తుతం 75 ఏళ్ల వయసులో ఉన్న తలైవా వేగం చూస్తుంటే.. టాలీవుడ్, కోలీవుడ్ అనే తేడా లేకుండా కుర్ర హీరోలందరికీ మైండ్ బ్లాంక్ అవ్వాల్సిందే. ఈ ఏజ్‌లో ఆ స్పీడ్ ఏంటి తలైవా.. అంటూ అభిమానులు నోరెళ్లబెడుతున్నారు. ఏడాదికి కనీసం ఒక సినిమాతో బాక్సాఫీస్ వద్ద సందడి చేయాలనే క్లియర్ టార్గెట్‌తో దూసుకుపోతున్నారు రజనీకాంత్. గతేడాది ఆయన కథానాయకుడిగా వచ్చిన 'కూలీ' సినిమా బాక్సాఫీస్ దగ్గర మంచి కలెక్షన్లు రాబట్టినప్పటికీ.. టాక్ విషయంలో కాస్త మిశ్రమ ఫలితాలనే సాధించింది. అయితే, ఆ సినిమా టాక్ ఎలా ఉన్నా సరే, తలైవా రేంజ్, మేనియా మాత్రం తగ్గలేదని బాక్సాఫీస్ నంబర్స్ స్పష్టం చేశాయి. ఇక 'కూలీ' తర్వాత అభిమానుల చూపు మొత్తం 'జైలర్ 2' పైనే ఉంది. నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటోన్న ఈ భారీ సీక్వెల్ ఈ ఏడాది అక్టోబర్‌లో థియేటర్లలోకి రావడానికి సిద్ధమవుతోంది. మొదటి భాగం సృష్టించిన సునామీతో పోలిస్తే.. పార్ట్-2 పై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. రజనీకాంత్ మార్క్ మాస్ యాక్షన్‌తో పాటు అనిరుధ్ ఇచ్చే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవబోతోంది. ఇక్కడితోనే రజనీ వేగం ఆగలేదు. 'జైలర్ 2' రిలీజ్ కాకముందే మరొక క్రేజీ ప్రాజెక్ట్‌ను జెట్ స్పీడ్‌తో ముందుకు తీసుకెళ్తున్నారు. 'ఓ మై కడవులే, రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్' వంటి వైవిధ్యమైన సినిమాలతో ఆకట్టుకున్న దర్శకుడు అశ్వత్ మరిముత్తు దర్శకత్వంలో 'ధర్మన్' అనే చిత్రం తెరకెక్కుతోంది. విశ్వనటుడు కమల్ హాసన్ సొంత నిర్మాణ సంస్థ రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తుండటం విశేషం. ఇటీవల ఈ సినిమా పూజా కార్యక్రమాలు ఎంతో ఘనంగా జరిగాయి. జూన్ నెలలో ఈ సినిమాకు సంబంధించిన ఓపెనింగ్ భారీ స్థాయిలో జరిగింది. ఆ వెంటనే సినిమాకు సంబంధించిన మొదటి షెడ్యూల్ షూటింగ్ మొదలుపెట్టడం, దాన్ని పూర్తి చేయడం రెండూ జరిగిపోయాయి. ఇప్పుడు సెకండ్ షెడ్యూల్‌ను కూడా సూపర్ స్పీడ్‌లో మొదలుపెట్టేశారు. అంతేకాదు, తాజాగా విడుదలైన ఈ సినిమా ప్రోమో రజనీ అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఈ చిత్రంలో తలైవా ఒక డెడ్లీ డాక్టర్ పాత్రలో కనిపించబోతుండటం విశేషం. అనిరుధ్ ఇచ్చిన మైండ్ బ్లాకింగ్ మాస్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, తలైవా లుక్ చూస్తుంటే.. అభిమానులకు ఈ సినిమాతో ఫుల్ మీల్స్ గ్యారెంటీ అనిపిస్తోంది. ఈ చిత్రంలో రజనీకాంత్‌తో పాటు సీనియర్ నటి సిమ్రాన్, గ్లామరస్ బ్యూటీ రాశీ ఖన్నా అలాగే కమెడియన్ యోగి బాబు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. కమల్ హాసన్ నిర్మిస్తున్న ఈ సినిమా ఏ స్థాయిలో అంచనాలను అందుకుంటుందో చూడాలి.




మాస్ మహారాజా రవితేజ హీరోగా శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఇరుముడి' సినిమా ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఇటీవల విడుదలైన ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన రావడంతో సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి. ముఖ్యంగా తండ్రీకూతుళ్ల అనుబంధం, భావోద్వేగాలు, యాక్షన్ అంశాలు ట్రైలర్‌లో ఆకట్టుకోవడంతో రవితేజ అభిమానులు ఈ సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అలాగే సినిమా టైటిల్‌పై వివాదం కూడా మొదలైంది. ట్రైలర్ లాంచ్ సందర్భంగా దర్శకుడు శివ నిర్వాణ 'ఇరుముడి' టైటిల్ వెనుక ఉన్న కారణాన్ని వివరించారు. ఇది పూర్తిస్థాయి భక్తి కథ కాదని, తండ్రీకూతుళ్ల బంధం, అయ్యప్ప భక్తుడి విశ్వాసం, క్రైమ్ మిస్టరీ.. ఇలా మూడు విభిన్న కోణాలు సినిమాలో ఉంటాయని తెలిపారు. ఈ అంశాలన్నింటినీ కలిపే భావనతో 'ఇరుముడి' అనే టైటిల్‌ను పెట్టినట్లు చెప్పారు. దర్శకుడి వివరణపై అయ్యప్ప స్వామి భక్తులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. శబరిమల యాత్రలో అత్యంత పవిత్రంగా భావించే ఇరుముడి పేరును క్రైమ్ మిస్టరీతో కూడిన కథకు ఉపయోగించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నిస్తున్నారు. సినిమాలో మూడు ప్రధాన అంశాలు ఉన్నాయని దర్శకుడు చెబుతున్నప్పుడు 'త్రిముడి' వంటి మరో పేరును పెట్టొచ్చు కదా? పవిత్రమైన 'ఇరుముడి' పేరునే ఎందుకు ఎంచుకున్నారని సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. సినిమా విడుదలకు సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో ఈ వివాదం మరింత ఆసక్తికరంగా మారింది. టైటిల్‌పై అభ్యంతరాలు సెన్సార్ ప్రక్రియపై ప్రభావం చూపుతాయా? చిత్రబృందం టైటిల్‌లో ఏమైనా మార్పులు చేస్తుందా? లేదా వివాదాలను పట్టించుకోకుండా ఇదే పేరుతో సినిమా విడుదల చేస్తారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

Cinema




ప్రస్తుతం టాలీవుడ్‌లో హీరోయిన్ ఓరియంటెడ్ చిత్రాలకు మంచి ఆదరణ లభిస్తోంది. ఒకప్పుడు హీరోయిన్ పాత్రలు హీరోని మించి ఉండేవి కావు. ఎప్పుడో ఒకటి రెండు చిత్రాలు మాత్రమే హీరోయిన్ బేస్డ్‌గా వచ్చేవి. కానీ, ఇప్పుడు కథానాయికలే కథను తమ భుజాలపై మోసే స్థాయిలో సినిమాలు రూపొందుతున్నాయి. అనుష్క, సమంత, రష్మిక మందన్న వంటి హీరోయిన్స్ తమదైన నటనతో కథను తమ భుజాలపై మోసి.. ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకున్నారు. ఇప్పుడు అదే బాటలో మరో అడుగు ముందుకు వేస్తూ కామాక్షి భాస్కర్ల 'అగధ'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆగస్ట్ 14న విడుదలకు సిద్ధమైన 'అగధ' చిత్రంలో కామాక్షి భాస్కర్ల మహాదేవి అనే పాత్రలో ప్రధాన పాత్రను పోషించారు. ప్రముఖ దర్శకుడు, నిర్మాత ఎం.ఎస్. రాజు దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంపై ఇప్పటికే భారీగా అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటి వరకు కామాక్షి చేసిన పాత్రలతో పోలిస్తే మహాదేవి పాత్ర పూర్తిగా భిన్నమైనదిగా కనిపిస్తోంది. నటనకు ప్రాధాన్యమున్న సన్నివేశాలతో పాటు యాక్షన్ సన్నివేశాల్లోనూ ఆమె కనిపించనుండటం ఈ పాత్రపై మరింత ఆసక్తిని పెంచుతోంది. మరోవైపు ఈ తరహా చిత్రాలు అంటే 'పొలిమేర', 'పొలిమేర 2' చిత్రాలు కామాక్షి భాస్కర్లకు ఎలాంటి సక్సెస్‌ని ఇచ్చాయో తెలియంది కాదు. ఇప్పుడలాంటి మిస్టరీ థ్రిల్లర్ జానర్‌లోనే ఇప్పుడు 'అగధ' రాబోతోంది. కచ్చితంగా కామాక్షికి మరో బంపర్ హిట్‌గా ఈ చిత్రం నిలుస్తుందని ఆమె ఫ్యాన్స్ భావిస్తున్నారు. కామాక్షి భాస్కర్ల విషయానికి వస్తే.. ఆమె మొదటి నుంచి ఒకే రకమైన పాత్రలకు పరిమితం కాకుండా, నటిగా విభిన్నమైన భావోద్వేగ పాత్రలతో ప్రేక్షకుల మెప్పు పొందాలనే ప్రయత్నాలు చేస్తూనే ఉంది. 'అగధ'లోని మహాదేవి పాత్ర కూడా తన జర్నీలో మరో ముఖ్యమైన మెట్టుగా నిలిచే అవకాశం లేకపోలేదు. ఇప్పటికే 'అగధ'పై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొన్న నేపథ్యంలో ఒక మహిళా ప్రధాన కథను తన భుజాలపై మోస్తూ కామాక్షి భాస్కర్ల మహాదేవిగా ఏ స్థాయిలో మెప్పించనున్నారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. కామాక్షి భాస్కర్ల కెరీర్‌లో 'అగధ' ఒక సరికొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందా? మహిళా ప్రధాన చిత్రాల విజయ పరంపరలో మరో విజయాన్ని నమోదు చేస్తుందా? అనేది తెలియాలంటే మాత్రం ఇంకొన్ని గంటలు వేచి చూడాల్సిందే.




తమిళ స్టార్ హీరో విక్రమ్ ప్రస్తుతం ఓ అరుదైన వన్యప్రాణికి సంబంధించిన వివాదంలో చిక్కుకున్న విషయం తెలిసిందే. ఇటీవల విక్రమ్ లార్ గిబ్బన్ కోతితో విక్రమ్ ఉన్న వీడియో ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ వ్యవహారం వివాదం మరింత ముదిరింది. దీంతో ఈ విషయం తమిళనాడు అటవీశాఖ దృష్టిన పడింది. లార్ గిబ్బన్‌ను ఎక్కడి నుంచి తీసుకువచ్చారు? దాన్ని పెంచేందుకు అవసరమైన అనుమతులు ఉన్నాయా? అనే అంశాలపై అధికారులు విచారణ చేపట్టారు. తాజాగా ఈ కేసులో విక్రమ్‌కు అటవీశాఖ నోటీసులు జారీ చేశారు. లార్ గిబ్బన్‌కు సంబంధించిన పూర్తి వివరాలను మూడు రోజుల్లోగా అటవీశాఖకు సమర్పించాలని అధికారులు విక్రమ్‌ను ఆదేశించారు. ఆ కోతి ఎక్కడి నుంచి వచ్చింది, ఎవరికి చెందినది, విక్రమ్ కుటుంబానికి సంబంధించిన వ్యక్తుల వద్దకు ఎప్పుడు తీసుకువచ్చారు వంటి వివరాలను ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నట్లు సమాచారం. అలాగే లార్ గిబ్బన్‌ను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలించేందుకు ఎలాంటి అనుమతులు తీసుకున్నారు? దానికి సంబంధించిన పత్రాలు ఏమిటి? కోతి కొనుగోలు, బదిలీ, పెంపకానికి సంబంధించిన రికార్డులు ఏమైనా ఉన్నాయా? అనే అంశాలపై కూడా అధికారులు వివరాలు కోరినట్లు తెలుస్తోంది.




OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085